ఆంధ్రజ్యోతి **
ANDHRAJYOTHY
సూర్యాపేట
5
గురువారం 1 ఫిబ్రవరి 2024

చికెన్ ధరలు
గుడ్ల డజన్ ధర : 65

జిల్లా	లైవ్	డ్రెస్	స్కిన్‌లెస్
యాదాద్రి	రూ.131	190	216
సూర్యాపేట	రూ.130	190	210
నల్లగొండ	రూ.129	187	213

ఉష్ణోగ్రత గరిష్ఠం 31.0 కనిష్ఠం 16.4

నిర్మలమ్మ కరుణించేనా?



- ఎన్నికల బడ్జెట్‌పై అందరిచూపు
- నేడు లోక్‌సభలో ప్రవేశపెట్టనున్న కేంద్రమంత్రి
- కలగానే మిగిలిన కొత్త రైళ్లు, డబుల్ లైన్లు
- ఈసారైనా బుల్లెట్ రైలు వచ్చేనా?

లోక్‌సభ ఎన్నికల ముంగిట కేంద్ర ఆర్థికశాఖ మంత్రి నిర్మలాసీతారామన్ గురువారం ప్రవేశపెట్టనున్న తాత్కాలిక బడ్జెట్‌పై అందరి దృష్టి నెలకొంది. వరుసగా మూడోసారి కేంద్రంలో అధికారం చేజిక్కించుకునేందుకు దక్షిణాది రాష్ట్రాల్లో అధిక సీట్లు సాధించాలని ఇప్పటికే కేంద్రం కార్యాచరణను అమలులో పెట్టింది. అందుకు ఈ బడ్జెట్‌ను జనరంజకంగా కేంద్రప్రభుత్వం రూపొందించినట్లు పలువురు అభిప్రాయపడుతున్నారు. తాత్కాలిక బడ్జెట్ అయినా, ఇందులో పలు కీలక ప్రకటనలుంటాయని ఉమ్మడి నల్లగొండ జిల్లా వాసులు ఆశగా ఎదురుచూస్తున్నారు.

● (ఆంధ్రజ్యోతి ప్రతినిధి-నల్లగొండ)

కొత్త రైల్వే లైన్లు, కొత్త రైళ్లు, జాతీయ రహదారులు, కేంద్రం నుంచి కీలకమైన ప్రాజెక్టులకు నిధుల మద్దతు ఉంటుందనే ఆశతో గడచిన తొమ్మిదేళ్లుగా ఎదురుచూసినా ఉమ్మడి జిల్లాకు ఆశించిన స్థాయిలో ప్రాజెక్టులు దక్కలేదు. గత లోక్‌సభలో ఉమ్మడి జిల్లా నుంచి ప్రాతినిధ్యం వహించిన ఎంపీలు ఎన్.ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి కాంగ్రెస్ నేతలు కావడం, రాజ్యసభ సభ్యుడు బడుగుల లింగయ్యయాదవ్ బీఆర్ఎస్‌కు చెందిన నేత కావడంతో నిధుల కేటాయింపుల్లో కేంద్రం వివక్ష ప్రదర్శించిందనే విమర్శలు ఉన్నాయి. ఈ నేపథ్యంలో తాజాగా కేంద్రం ప్రవేశపెట్టనున్న బడ్జెట్‌లోనైనా ఎన్నికలను దృష్టిలో ఉంచుకొని ఉమ్మడి జిల్లాకు తగిన ప్రాధాన్యమివ్వాలనే డిమాండ్ వ్యక్తమవుతోంది.

గత బడ్జెట్‌లో కేటాయింపులే..

ఉమ్మడి జిల్లాకు కేంద్రం ఏటా బడ్జెట్‌లో రైల్వే ప్రాజెక్టులకు నిధులు కేటాయిస్తున్నా అది ప్రకటనలకే పరిమితం అవుతోంది. బీబీనగర్-నడికుడి డబ్లింగ్‌కు గత బడ్జెట్‌లో రూ.750కోట్లు ప్రకటించినా ఈ ప్రాజెక్టు పట్టాలెక్కలేదు. మిర్యాలగూడ-డోర్నకల్ కొత్త రైల్వే లైన్ సర్వేకు ఆదేశించినా, ఇంకా పూర్తి డిజైన్ అమలులోకి రాలేదు. విష్ణుపురం-మోటమర్రి మధ్య ఉన్న 90కి.మీ సింగిల్‌లైన్‌ను డబ్లింగ్ చేసేందుకు ప్రతిపాదనలు ఉన్నా నిధుల కేటాయింపులు లేవు. ఈ ప్రతిపాదన అమలులోకి వస్తే ఈ మార్గం వెంట ఉన్న సిమెంట్ పరిశ్రమలతో పాటు దామరచర్లలో నిర్మాణంలో ఉన్న 4,000 మెగావాట్ల యాదాద్రి థర్మల్ పవర్ ప్రాజెక్టుకు ప్రయోజనకరంగా ఉంటుంది.



2020-2021 నుంచి ఈ ప్రతిపాదనలు ఉన్నా, నిధుల కేటాయింపు లేదు. అంతేగాక, ఉమ్మడి జిల్లా ప్రజలు ఎప్పటి నుంచో ఎదురుచూస్తున్న హైదరాబాద్-విజయవాడ బుల్లెట్ రైలు కలగానే మిగిలింది. ఇటీవల సికింద్రాబాద్ నుంచి వైజాగ్ మధ్య ప్రవేశపెట్టిన వందేభారత్ రైలు వరంగల్, విజయవాడ మీదుగా వైజాగ్ వెళ్తుంది. ఈ రైలును సికింద్రాబాద్ నుంచి జిల్లా మీదుగా విజయవాడ, వైజాగ్‌కు నడిపిస్తారని అప్పట్లో చర్చసాగింది. అయితే రైల్వే లైన్ డబ్లింగ్ కాకపోవడంతో పాటు పట్టాల పటిష్ఠత లేకపోవడంతో సాధారణ రైళ్లను మాత్రమే గంటకు 60కి.మీ వేగంతో నడిపిస్తున్నారు. బుల్లెట్ రైల్‌ను హైదరాబాద్-విజయ్‌వాడ మధ్య నడిపితే ఇటు రాష్ట్ర ప్రజలతోపాటు, అటు ఆంధ్రప్రదేశ్, ఒడిశా రాష్ట్ర ప్రజలకు సైతం ప్రయోజనకరంగా ఉంటుంది. హైదరాబాద్-విజయవాడకు రెండు రైలు మార్గాలు ఉన్నాయి. అందులో ఒకటి కాజీపేట మీదుగా 349కి.మీ, రెండోది మిర్యాలగూడ మీదుగా 313కి.మీ. 65వ నెంబరు జాతీయ రహదారికి సమాంతరంగా రైల్వే లైన్ ఏర్పాటు చేస్తే 250కి.మీ.లోనే విజయవాడకు చేరుకునే అవకాశం ఉంది. హైదరాబాద్-చిట్యాల వరకు విజయవాడ-జగ్గయ్యపేట వరకు ఇప్పటికే రైల్వే ట్రాక్ ఉంది. చిట్యాల-జగ్గయ్యపేట మధ్య కొత్త ట్రాక్ ఏర్పాటు చేస్తే ఈ సమస్యకు పరిష్కారం లభిస్తుంది. అందుకు గతంలో భూసేకరణ కూడా చేపట్టారు. హైదరాబాద్-విజయవాడ మధ్య బుల్లెట్ రైలు ప్రతిపాదన కేంద్రం వద్ద ఉన్నా ప్రతీసారి బడ్జెట్‌లో మొండి చేయే దక్కింది.

65వ నెంబర్ జాతీయరహదారి విస్తరణకు గ్రీన్‌సిగ్నల్ లభించేనా?

ఉమ్మడి జిల్లా మీదుగా వెళ్లే 65వ నెంబర్ జాతీయరహదారి విస్తరణకు కేంద్రం నిధులివ్వాలని ఈ ప్రాంత ప్రజలు కోరుతున్నారు. ఈ రహదారిని ఆరులైన్లుగా విస్తరించాలని గత ఎంపీ, ప్రస్తుత ఆర్‌అండ్‌బీశాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి కేంద్రమంత్రులను పలు పర్యాయాలు కలిసి నివేదికలు, ప్రతిపాదనలు సమర్పించారు. తాజా, బడ్జెట్‌లో ఈ ప్రాజెక్టుకు నిధులు కేటాయిస్తారని అంతా ఎదురుచూస్తున్నారు.

నిధుల కేటాయింపుపై ఆశలు

నవోదయ విద్యాలయాల్లో సదుపాయాల కల్పన, కేంద్రీయ విద్యాలయాల అప్‌గ్రేడేషన్, ఎయిమ్స్ అభివృద్ధికి నిధుల కేటాయింపుతో పాటు భూదాన్‌పోచంపల్లిలో ఐఐహెచ్‌టీ ఏర్పాటు, ప్రతిపాదిత నూతన జాతీయ రహదారి నిర్మాణానికి ఈ బడ్జెట్‌లోనైనా నిధులిస్తారని ప్రజలు ఆశగా ఉన్నారు. పోచంపల్లిలో ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ హ్యాండ్‌లూమ్ టెక్నాలజీ (ఐఐహెచ్‌టీ) ఏర్పాటు కోసం కేంద్రానికి రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే పలుమార్లు ప్రతిపాదనలు పంపింది. ఐఐహెచ్‌టీని మంజూరు చేస్తే ఇక్కడి హ్యాండ్‌లూమ్ పార్కులో ఉన్న భవనాల్లో కోర్సులను ప్రారంభించే అవకాశం ఉంది. యునెస్కో అనుబంధ సంస్థ అయిన ప్రపంచ పర్యాటక సంస్థ నుంచి ఇటీవల పోచంపల్లికి ప్రపంచ ఉత్తమ పర్యాటక గ్రామం అవార్డు దక్కింది. దీంతో అభివృద్ధికి ప్రత్యేక నిధులు వస్తాయని నేత కార్మికులు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు.

ఉద్యానం, మత్స్యశాఖకు కేటాయింపులుండేనా?

ఉమ్మడి నల్లగొండ జిల్లాలో తోటల విస్తీర్ణం గణనీయంగా పడిపోయింది. ఉద్యాన పంటలు ఉమ్మడి జిల్లాలో 1.20లక్షల ఎకరాలకు మించిలేని పరిస్థితి ఉంది. ఒకప్పుడు దేశంలోనే అత్యధికంగా ఉమ్మడి నల్లగొండ జిల్లాలో సుమారు 3.75లక్షల ఎకరాల్లో తోటలు ఉండేవి. ఓ వైపు తోటల విస్తీర్ణం తగ్గుతున్నా, కేంద్ర ప్రభుత్వం ఉద్యాన పంటల సాగును ప్రోత్సహించేలా కేటాయింపులు ఉండటంలేదు. గత బడ్జెట్‌లో దేశంలోని అన్ని రాష్ట్రాలకు కేవలం రూ.2,220కోట్లు మాత్రమే కేటాయించింది. ఆత్మనిర్భర్ హార్టికల్చర్ క్లీన్ ప్లాంట్ పథకం ప్రవేశపెట్టిన కేంద్రం దీని ద్వారా వ్యాధి నిరోధకత, నాణ్యత కలిగిన ప్లాంటింగ్ కోసం మొక్కలను సరఫరా చేసేందుకు నిర్ణయించినా బడ్జెట్ కేటాయింపులు సరిపోలేదు. నూతనంగా ప్రవేశపెట్టిన మత్స్య సంపద యోజనకు కూడా గత బడ్జెట్‌లో కేంద్రం రూ.6,000కోట్లు మాత్రమే కేటాయించింది.



సీపీఎస్ రద్దుపై ఉద్యోగుల ఆశలు

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల పరిధిలో 2004 తర్వాత నియామకమైన ఉద్యోగులను ఇబ్బంది పెట్టేలా ఉన్న సీపీఎస్ రద్దు చేయాలని ఉద్యోగులు డిమాండ్ చేస్తున్నారు. దీనిపై కేంద్రం స్పందించాలని వారు కోరుతున్నారు. ఉద్యోగుల వేతనం నుంచి కోత విధించే ఆ మొత్తాన్ని షేర్ మార్కెట్‌లో ఉంచడం వల్ల పెన్షన్ తగ్గుతుందని ఉద్యోగులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పీఎఫ్ ఆర్‌డీఏ చట్టాన్ని, నూతన పెన్షన్ విధానాన్ని రద్దు చేయాలని, పాత పెన్షన్ విధానాన్ని తిరిగి ప్రవేశపెట్టాలని ఉద్యోగులు ఏళ్లుగా డిమాండ్ చేస్తున్నారు. అదే విధంగా ఇన్‌కంట్యాక్స్ స్లాబ్‌లను సవరించాలని ఉద్యోగులు కోరుతున్నారు. దీనిపై కేంద్రం ఎలా స్పందిస్తుందోనని చర్చ సాగుతోంది.





వ్యవసాయం, ఇతర రంగాలపై ఆశలు

కేంద్ర ప్రభుత్వం గత ఏడాది కిసాన్ డ్రోన్స్‌ను ప్రవేశపెడుతున్నట్లు ప్రకటించింది. ఇది ఆచరణలో అమలుకు నోచుకోలేదు. వరి, ఇతర పంటల ఉత్పత్తుల కొనుగోలుకు బడ్జెట్‌లో ప్రత్యేకంగా నిధులు కేటాయిస్తున్నామని చెప్పినా, కొనుగోలు సమయానికి వచ్చేసరికి రైతులకు మద్దతు ధర దక్కడం లేదు. ఆధునిక పద్ధతుల్లో సేంద్రీయ వ్యవసాయాన్ని ప్రోత్సహించేందుకు కేటాయింపులు ఉండడంలేదు. ఉమ్మడి నల్లగొండ జిల్లావ్యాప్తంగా సుమారు 11.50లక్షల మంది వ్యవసాయంపై జీవనం సాగిస్తున్నారు. గత బడ్జెట్‌లో బీడు భూముల్లో సోలార్ విద్యుత్ కేంద్రాలు ఏర్పాటు చేసి సాయం అందిస్తామని చెప్పినా అమలు కాలేదు. ఇది అమలైతే ఆలేరు, భువనగిరి, తుంగతుర్తి, మునుగోడు, దేవరకొండ నియోజకవర్గాల రైతులకు ప్రయోజనం చేకూరుతుంది. వ్యవసాయ రంగంలో కూలీల కొరతను అధిగమించేందుకు అద్దె ప్రతిపాదికన ఆధునిక వ్యవసాయ పరికరాలను అందజేస్తామని కేంద్రం ప్రకటించింది. దీంతో ఉమ్మడి జిల్లాలో 7లక్షల మంది చిన్న, సన్నకారు రైతుల్లో ఆశలు చిగురించగా అవి అడియాశలుగానే మిగిలాయి.

ప్రత్యేక రాష్ట్రం ఏర్పడిన తర్వాత చేయూతలో భాగంగా పలు సాగునీటి ప్రాజెక్టులకు కేంద్రం నిధులు మంజూరు చేయాల్సి ఉంది. డిండి ఎత్తిపోతల వంటి పథకాలకు కేంద్రం నిధులు మంజూరు చేస్తుందని సుదీర్ఘకాలంగా జిల్లా వాసులు ఎదురుచూస్తున్నారు. ఈ బడ్జెట్‌లోనైనా ఉమ్మడి జిల్లాకు చెందిన సాగునీటి ప్రాజెక్టులకు కేంద్రం చేయూత ఇవ్వాలని జిల్లా ప్రజాప్రతినిధులు, ప్రజలు కోరుతున్నారు. ఇదిలా ఉంటే సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమల స్థాపనకు నిధులు కేటాయించి ఉపాధి అవకాశాలు కల్పిస్తామని గతంలో కేంద్రం హామీ ఇచ్చింది. అయితే ఆశించిన స్థాయిలో ప్రోత్సాహం లేకపోవడంతో పారిశ్రామిక రంగం ముందడుగు వేయడం లేదు. కేంద్రం ప్రకటన చేసినా బ్యాంకర్లు పలు కారణాలు చూపుతూ రుణాలు ఇవ్వడం లేదని ఔత్సాహికులు చెబుతున్నారు. దీనికితోడు అంగన్‌వాడీ కేంద్రాలపై వరాలు గుప్పించినా, ఆశించిన స్థాయిలో ఈ కేంద్రాలు ఆధునికీకరణ జరగలేదు. ఇప్పటికీ చాలా అంగన్‌వాడీ కేంద్రాలు అద్దె ఇళ్లలోనే కొనసాగుతున్నాయి. ఉమ్మడి జిల్లాలో మొత్తం 18 ప్రాజెక్టుల పరిధిలో 4,166 అంగన్‌వాడీ కేంద్రాలు ఉండగా, వాటికి పెద్దగా లబ్ధి జరిగింది లేదు.

రూ.25వేల కోట్లు కేటాయించాలి



పామాయిల్ సాగును పెంచేందుకు కేంద్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టనున్న బడ్జెట్‌లో రూ.25వేల కోట్లు కేటాయించాలి. ఆయిల్‌పామ్ సాగుకు కేంద్ర ప్రభుత్వం 60శాతం, రాష్ట్రం 40శాతం సబ్సిడీ ఇచ్చి ప్రోత్సహిస్తున్నాయి. మన రాష్ట్రంతో పాటు దేశంలో వంట నూనెల కొరత తీరేందుకు ఆయిల్‌పామ్ సాగు ప్రధాన మార్గం. ఇతర నూనెల పంటల సాగు కష్టతరం కాగా, యేడాది కింత తగ్గుతూ వస్తోంది. ప్రస్తుతం 12 ఎకరాల్లో ఆయిల్‌పామ్ సాగుకు మాత్రమే కేంద్ర ప్రభుత్వం డ్రిప్ యంత్రాలపై సబ్సిడీ ఇస్తోంది. దీంతో పెద్ద కమతాల్లో ఆయిల్‌పామ్ సాగుకు రైతులు ముందుకు రావడంలేదు. డ్రిప్‌పై ఎస్సీ, ఎస్టీ రైతులకు 100శాతం, బీసీలకు 90శాతం, ఓసీలకు 80శాతం సబ్సిడీ ఉంది. ఈ బడ్జెట్‌లో నిధులు పెంచి ఆయిల్‌పామ్ సాగుకు 12ఎకరాలుగా ఉన్న డ్రిప్ పరిమితిని ఎత్తివేయాలి. అన్ని వర్గాల రైతులకు 100శాతం సబ్సిడీ ఇవ్వాలి. అప్పుడే ఆయిల్‌పామ్ సాగు పెరుగుతుంది. విదేశాల నుంచి వచ్చే పామాయిల్‌పై దిగుమతి సుంకం పెంచితే కూడా దేశంలో ఆయిల్‌పామ్ సాగు చేసే రైతులకు మంచి ధర లభిస్తుంది.

రామకృష్ణారెడ్డి, ఆయిల్ ఫెడ్ రాష్ట్ర మాజీ చైర్మన్

జాతీయ చేనేత విధానాన్ని రూపొందించాలి



చేనేత రంగం సజీవంగా ఉండాలంటే కేంద్ర ప్రభుత్వం నేషనల్ హ్యాండ్లూమ్ పాలసీ (జాతీయ చేనేత విధానం) రూపొందించి, అమలు చేయాలి. ఇప్పటి వరకు టెక్స్‌టైల్ పాలసీ మాత్రమే ఉంది తప్ప చేనేత పాలసీ లేదు. బడ్జెట్‌లో చేనేత, జౌళిశాఖకు కలిపి నిధులు కేటాయిస్తున్నందున చేనేత రంగానికి అన్యాయం జరుగుతోంది. ఈ బడ్జెట్‌లోనైనా చేనేతకు ప్రతేకంగా నిధులు కేటాయించాలి. కేంద్ర పభుత్వం చేనేత వస్త్రాలపై విధిస్తున్న జీఎస్టీ రద్దు చేయాలి. జాతీయ స్థాయిలో చేనేత కార్మికుల సంక్షేమ, అభివృద్ధి బోర్డు ఏర్పాటు చేసి తగినన్ని నిధులు కేటాయించాలి. ఇప్పటికే చేనేతకు 11 రకాల పేటెంట్లు ఉన్నా అమలుకు నోచుకోవడం లేదు. వీటిని పటిష్ఠంగా అమలుచేయాలి.

కూరపాటి రమేష్, చేనేత కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి

రైతులకు పెట్టుబడి సహాయం అందించాలి



కేంద్ర ప్రభుత్వం బడ్జెట్‌లో వ్యవసాయానికి నిధులు పెంచి రైతులకు రాష్ట్ర ప్రభుత్వంతో సమానంగా పెట్టుబడి సాయం అందించాలి. డీజిల్, యంత్రాలు, పరికరాలు, విత్తనాలు, ఎరువుల ధరలు, కూలీల రేట్లు పెరిగాయి. ఏ పంట సాగు చేయాలన్నా ఖర్చులు విపరీతంగా పెరిగాయి. మద్దతు ధర కూడా రైతులకు గిట్టుబాటు కావడం లేదు. రాష్ట్ర ప్రభుత్వం వచ్చే వానాకాలం సీజన్ నుంచి ఎకరాకు ఏడాది రూ.15,000 ఇవ్వనుంది. కేంద్రం కూడా రూ.15,000 పెట్టుబడి సాయం అందించేలా బడ్జెట్‌లో నిధులు కేటాయించాలి.

దామోదర్‌రెడ్డి, సీపీఐ నాయకుడు ● మోత్కూరు

బాధ్యతతో విధులు నిర్వహించాలి

● కలెక్టర్ ఎస్.వెంకట్రావ్



జెండా ఊపి బస్సులను ప్రారంభిస్తున్న కలెక్టర్ వెంకట్రావ్

సూర్యాపేట(కలెక్టరేట్), జనవరి 31: స్టాఫ్‌నర్సులుగా నియమితులైన ఉద్యోగులు బాధ్యతతో విధులు నిర్వహించాలని కలెక్టర్ ఎస్.వెంకట్రావ్ అన్నారు. బుధవారం జిల్లాలో నూతనంగా స్టాఫ్‌నర్సులుగా ఉద్యోగాలు పొందిన 212మంది హైదరాబాద్‌కు నియామక పత్రాలు అందుకునేందుకు వెళ్తుండగా బస్సును జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, నిబద్ధతతో విధులు నిర్వహించి వైద్యఆరోగ్యశాఖకు మంచి పేరు తేవాలన్నారు. కార్యక్రమంలో జడ్పీ సీఈవో సురేష్‌కుమార్, డీఎంహెచ్‌వో డాక్టర్ కోటాచలం, ప్రభుత్వ జనరల్ ఆస్పత్రి సూపరింటెండెంట్ దండ మురళీధర్‌రెడ్డి, మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ శారద, తదితరులు పాల్గొన్నారు.

పిల్లలకు పౌష్టికాహారం అందించాలి

చివ్వెంల: అంగన్‌వాడీ కేంద్రాల్లో పిల్లలకు ఆటపాటలతో విద్యను అందిస్తూ నాణ్యమైన పౌష్టికాహారం అందించాలని కలెక్టర్ ఎస్.వెంకట్రావ్ అన్నారు. బుధవారం మండల పరిధిలోని బీబీగూడెంలో అంగన్‌వాడీ సెంటర్, ప్రాథమిక పాఠశాలను ఆయన తనిఖీ చేసి మాట్లాడారు. అనంతరం ప్రాథమిక పాఠశాలలో విద్యార్థితో తెలుగు సరళ పదాలు చదివించారు. కార్యక్రమంలో తహసీల్దార్ రంగారావు, ఆర్పీ బీబీ, సూపర్‌వైజర్ ఏంజలీనా, సాలమ్మ, తదితరులు పాల్గొన్నారు.

బాలికలు పౌష్టికాహారం తీసుకోవాలి

అదనపు కలెక్టర్ ప్రియాంక

పెన్‌పహాడ్, జనవరి 31: బాలికలు పౌష్టికాహారం తీసుకోవాలని అదనపు కలెక్టర్ సీహెచ్.ప్రియాంక అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని కస్తూర్బా బాలికల పాఠశాల, ఉపాధి హామీ నర్సరీలను ఆమె తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, మధ్యాహ్న భోజన సమయంలో కొంతమంది బాలికలు కూరలోని కూరగాయలను పక్కన పడవేయగా, అదే సమయంలో వచ్చిన అదనపు కలెక్టర్ వాటిని చూసి కూరగాయల్లోనే పోషక పదార్థాలు ఉంటాయని, వాటిని పడవేయవద్దని సూచించారు. పదో తరగతిలో వందశాతం ఫలితాలు సాధించాలన్నారు. ఇంటర్ మొదటి సంవత్సరంలోనే ఎంసెట్‌కు ప్రణాళికలను సిద్ధం చేసుకోవాలన్నారు. పాఠశాలలో పారిశుధ్యంపై సిబ్బంది దృష్టి సారించాలన్నారు. కేజీబీవీలో బిల్లులు చెల్లించకపోవడంతో విద్యుత్ అధికారులు సరఫరా తొలగించారని బాలికలు ఆమె దృష్టికి తీసుకురాగా, వెంటనే స్పందించి విద్యుత్ అధికారులకు ఫోన్ చేయడంతో సరఫరాను పునరుద్ధరించారు. పాఠశాలలో త్వరలో ఆర్వో ప్లాంట్‌ను ఏర్పాటు చేయిస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఎంపీడీవో బాణాల శ్రీనివాస్, ఎంపీవో నరేష్, కేజీబీవీ ఇన్‌చార్జీ ప్రిన్సిపాల్ సునీత, ఏపీవో రవి, ఈసీ ఏకస్వామి, ఏపీఎం అజయ్‌నాయక్ పాల్గొన్నారు.



పెన్‌పహాడ్ కస్తూర్బా పాఠశాలలో విద్యార్థినులతో మాట్లాడుతున్న ప్రియాంక

నేటి నుంచి ఇంటర్ ప్రాక్టికల్ పరీక్షలు

● ఏర్పాట్లు పూర్తి చేసిన అధికారులు

భువనగిరి అర్బన్, భువనగిరి టౌన్, సూర్యాపేటఅర్బన్, భానుపురి, నల్లగొండ, జనవరి 31: ఉమ్మడి నల్లగొండ జిల్లాలో ఇంటర్ ద్వితీయ సంవత్సర విద్యార్థులకు ప్రాక్టికల్ పరీక్షలు నేటి నుంచి కొనసాగనున్నాయి. ప్రాక్టికల్స్‌కోసం అధికారులు ఇప్పటికే అన్ని ఏర్పాట్లు పూర్తిచేశారు. వార్షిక పరీక్షల గడువు సమీపిస్తుండడంతో ముందుగా ప్రాక్టికల్ పరీక్షలు పూర్తి చేస్తున్నారు. కళాశాలల్లో ప్రాక్టికల్స్ కోసం ల్యాబ్‌లను సిద్ధం చేసే పనిలో అధికారులు నిమగ్నమయ్యారు. ప్రాక్టికల్స్ పరీక్షలు జిల్లాలో ప్రతీసారి నామమాత్రంగానే జరుగుతున్నాయి. ప్రాక్టికల్స్‌లో జరుగుతున్న అక్రమాలను అరికట్టేందుకు రాష్ట్ర ఇంటర్ బోర్డు జంబ్లింగ్ విధానాన్ని అమలు చేయాలని గతంలో ఆలోచనలు చేసింది. కానీ జూనియర్ కళాశాలల యజమాన్యాల ఒత్తిళ్లకు తలొగ్గి జంబ్లింగ్ విధానాన్ని విరమించుకుంది. దీంతో ఏ కళాశాలల్లో చదివే విద్యార్థులు అదే కళాశాలల్లో ప్రాక్టికల్స్ పరీక్షలకు హాజరుకానున్నారు. జిల్లాలోని ఎక్కువ శాతం కళాశాలల్లో ల్యాబ్‌ల నిర్వహణ సక్రమంగాలేదు. ల్యాబ్‌లలో అవసరమైన పరికరాలు, రసాయనాలు కూడా అందుబాటులో లేవన్న విమర్శలున్నాయి. కేవలం ప్రాక్టికల్స్ పరీక్షల సమయంలో మాత్రమే వాటిని ఏర్పాటుచేసి తూతూ మంత్రంగా పరీక్షలు నిర్వహిస్తున్నారనే ఆరోపణలు వస్తున్నాయి.

ఉదయం 9 గంటల నుంచి..

నేటి నుంచి ఈ నెల 15వ తేదీ వరకు ప్రాక్టికల్స్ పరీక్షలను నిర్వహించనున్నారు. ఉదయం 9గంటల నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు తిరిగి మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 5గంటల వరకు పరీక్షలు నిర్వహించనున్నారు. ప్రాక్టికల్స్ పరీక్షలను జనరల్ సైన్స్, ఒకేషనల్ ద్వితీయ సంవత్సరం విద్యార్థులకు నిర్వహించేందుకు అన్ని చర్యలు చేపట్టారు. జనరల్ సైన్స్ విద్యార్థులకు, ఒకేషనల్ విద్యార్థులకు ప్రాక్టికల్స్ పరీక్షలు జరగనున్నాయి.



	యాదాద్రి	సూర్యాపేట	నల్లగొండ
మొత్తం కళాశాలలు	40	77	93
పరీక్షా కేంద్రాలు	54	53	104
ఒకేషనల్ విద్యార్థులు	1,423	2800	2804
జనరల్ సైన్స్ విద్యార్థులు	1,304	5100	15,583
మొత్తం విద్యార్థులు	2,727	7900	18,387

సెలవులే అధికం

ప్రభుత్వ కళాశాలల్లో నిర్వహించబోయే పరీక్షలకు సెలవులు అడ్డు రావడంతో విద్యార్థుల చదువులకు ఆటంకం కలగనుందనే అభిప్రా యం వ్యక్తమవుతోంది. ఈ సంవత్సరం ఫిబ్రవరి 1వ తేదీ నుంచి ప్రా రంభమైన ప్రాక్టికల్ 28 నుంచి ఇంటర్ పబ్లిక్ పరీక్షలు ప్రారంభం కా నున్నాయి. జనవరి, ఫిబ్రవరిలో అధికసెలవులు రావడంతో ఉత్తీర్ణత శాతంపై ప్రభావం చూపుతుందేమోనన్న ఆందోళన వ్యక్తమవుతోంది.

పకడ్బందీగా పరీక్షలు నిర్వహిస్తాం



జిల్లాలో ఇంటర్ ప్రాక్టికల్స్‌తోపాటు వార్షిక పరీక్షలను పకడ్బందీగా నిర్వహిస్తాం. ముందుగా ప్రాక్టికల్ పరీక్షలను నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు సిద్ధం చేశాం. ల్యాబ్‌లలో పరికరాలు, రసాయనాలు అందుబాటులో ఉండే విధంగా చర్యలు చేపడుతున్నాం. ఎక్కడ కూడా అక్రమాలకు తావు లేకుండా అధికారులను నియమించాం. విద్యార్థులు మంచి మార్కులు సాధించాలి.

జానపాటి కృష్ణయ్య డీఐఈవో, సూర్యాపేట

నిఘా పటిష్ఠం చేయాలి : ఎస్పీ



సూర్యాపేట పట్టణ పోలీస్‌స్టేషన్‌లో మాట్లాడుతున్న ఎస్పీ రాహుల్‌హెగ్డే బీకే

సూర్యాపేటక్రైం, జనవరి 31: జిల్లా కేంద్రంలో నిఘాను పటిష్ఠం చేయాలని ఎస్పీ రాహుల్‌హెగ్డే అన్నారు. బుధవారం పట్టణ పోలీస్ స్టేషన్‌ను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, పట్టణంలో నిరంతరం పెట్రోలింగ్ చేయాలన్నారు. సిబ్బంది అప్రమత్తంగా ఉండి అనుమానితుల సమాచారాన్ని సేకరించాలన్నారు. వ్యాపారులు రాత్రివేళ సమయపాలన పాటించాలన్నారు. అవసరమైన మేరకు సీసీ కెమెరాలు ఏర్పాటు చేయించాలన్నారు. రోడ్లపై రద్దీ పెరిగిందని, దానికి అనుగుణంగా ట్రాఫిక్ నియంత్రణకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ప్రజలకు పోలీసులు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటారన్నారు. ఈ సందర్భంగా స్టేషన్ నిర్వహణ తీరు, పిటిషన్ మేనేజ్‌మెంట్ రిజిస్టర్, డయల్ 100 కాల్ స్పందనను పరిశీలించారు. కార్యక్రమంలో ట్రైనీ ఐపీఎస్ రాజేష్‌మీనా, పట్టణ ఇన్‌స్పెక్టర్ జి.రాజశేఖర్, ట్రాఫిక్ ఎస్ఐ నవీన్‌కుమార్ పాల్గొన్నారు.

రేషన్ బియ్యం దారి మళ్లిస్తే చర్యలు : ఆర్డీవో

సూర్యాపేట(కలెక్టరేట్), జనవరి 31: రేషన్ బియ్యాన్ని దారి మళ్లిస్తే చర్యలు తప్పవని సూర్యాపేట ఆర్డీవో సీహెచ్.కృష్ణయ్య హెచ్చరించారు. బుధవారం జిల్లా కేంద్రంలోని ఆర్డీవో కార్యాలయంలో రేషన్ డీలర్లతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రతీ నెల రేషన్ బియ్యాన్ని గడువులోగా లబ్ధిదారులకు పంపిణీ చేయాలన్నారు. సమావేశంలో తహసీల్దార్ శ్యాంసుందర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.



ఇస్తాలపురం అంగన్‌వాడీ కేంద్రంలో రికార్డులను తనిఖీచేస్తున్న ఆర్డీవో కృష్ణయ్య

ఆత్మకూర్(ఎస్): మండల పరిధిలోని నెమ్మికల్, ఇస్తాలపురం గ్రామాల్లో అంగన్‌వాడీ కేంద్రాలు, రేషన్ దుకాణాలు, మండల కేంద్రంలోని గ్రామపంచాయతీ కార్యాలయం, పల్లె ప్రకృతి వనాలను ఆర్డీవో కృష్ణయ్య బుధవారం తనిఖీ చేశారు. ఆయన వెంట ఆర్ఐ అంజయ్య, తదితరులు ఉన్నారు.

3,526 శునకాలకు రేబిస్ నివారణ టీకాలు

● జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి శ్రీనివాసరావు

భానుపురి, జనవరి 31: జిల్లాలోని 3,526 పెంపుడు శునకాలకు రేబిస్ నివారణ టీకాలు వేశామని జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి శ్రీనివాసరావు తెలిపారు. జనవరి 30తో జంతు సంక్షేమ పక్షోత్సవాలు ముగిశాయని తెలిపారు. జిల్లాలోని నాలుగు పాలిటెక్నిక్‌ల్లో జంతు సంక్షేమంపై విద్యార్థులకు వ్యాసరచన, వక్తృత్వ పోటీలు నిర్వహించామన్నారు. జంతు రక్షణపై విద్యార్థులు, గోశాలల్లో పని చేసే సిబ్బందికి పశువుల జాగ్రత్తగా చూసుకోవాలని అవగాహన కల్పించామన్నారు. ప్రతీ ఒక్కరూ జంతువులను ప్రేమించాలని సూచించారు.

విద్యుత్ స్తంభం కూలి యువకుడి మృతి

మేళ్లచెర్వు, జనవరి 31 : సూర్యాపేట జిల్లా మేళ్లచెర్వు మండలంలో విద్యుత్‌స్తంభం కూలి యువకుడు మృతి చెందాడు. ఎస్‌ఐ సురేష్ తెలిపిన వివరాల ప్రకారం నడిగూడెం మండల సిరిపురం గ్రామానికి చెందిన కరుణాకర్ నూతనంగా కరెంటు స్తంభాలు, విద్యుత్ వైర్లు లాగే పనికి వెళ్తున్నాడు. ఈ క్రమంలో మంగళవారం సాయంత్రం మేళ్లచెర్వు మండలంలో నూతన కరెంటు స్తంభం ఎక్కి విద్యుత్ వైరు లాగుతుండగా ప్రమాదవశాత్తు స్తంభం పడిపోగా, దాని కిందపడి కరుణాకర్ తీవ్రంగా గాయపడ్డాడు. సహచరులు అతడిని కోదాడలోని ఆసుపత్రికి తరలించగా, చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందాడని ఎస్‌ఐ తెలిపారు. కరుణాకర్ తల్లి సులోచన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని, అతడికి భార్య, కుమార్తె ఉన్నారని ఎస్‌ఐ తెలిపారు.

ప్రమాదవశాత్తు రైలు కింద పడి మహిళ..

నల్లగొండ, జనవరి 31 : నల్లగొండ జిల్లా కేంద్రంలో ప్రమాదవశాత్తు రైలు కింద పడి మహిళ మృతి చెందింది. నల్లగొండ రైల్వేస్టేషన్ మహిళా ఎస్‌ఐ సాలకమ్మ తెలిపిన వివరాల ప్రకారం విశాఖపట్నం నుంచి కర్నూలుకు వెళ్తున్న ప్రత్యేక రైలులో బుధవారం ఉదయం ఆరు గంటలకు నల్లగొండ స్టేషన్‌లో రైలు ఆగిన సందర్భంగా ధనలక్ష్మి అనే మహిళ రైలు దిగుతూ ప్రమాదవశాత్తు మృతి చెందిందన్నారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామన్నారు.

బెల్ట్‌షాపుల్లో పోలీసుల తనిఖీలు

సంస్థాన్‌నారాయణపురం, జనవరి 31 : యాదాద్రిభువనగిరి జిల్లా సంస్థాన్‌నారాయణపురంలోని పలు గ్రామాల్లో బెల్ట్‌షాపులపై ఎస్‌ఐ రాఘవేందర్ ఆధ్వర్యంలో తనిఖీలు నిర్వహించారు. వాయిల్లపల్లిలో వణం వెంకటేష్ మద్యం విక్రయిస్తుండగా చాకచక్యంగా పట్టుకున్నారు. అతడిపై కేసు నమోదు చేసి తహసీల్దార్ వద్ద రూ.లక్షకు బైండోవర్ చేశారు. అదేవిధంగా పుట్టపాక గ్రామానికి చెందిన అశోక్ గతంలో మద్యం విక్రయించే కేసులో బైండోవర్ కాగా మరోసారి మద్యం విక్రయిస్తూ పట్టుబడ్డాడు. అతడిపై పోలీసులు కేసు నమోదు చేసి తహసీల్దార్ ఎదుట హాజరుపర్చారు. బైండోవర్‌ను అతిక్రమించినందుకు అతడికి రూ.50 వేల జరిమానా విధించారు. బెల్ట్‌షాపు నిర్వాహకులకు మద్యం విక్రయించిన చౌటుప్పల్ బాలాజీ వైన్‌షాప్, గట్టుప్పల్‌లోని శ్రీలక్ష్మి మద్యం దుకాణాలపై కూడా కేసు నమోదు చేశారు. బెల్ట్‌షాపులు నిర్వహిస్తే చర్యలు తీసుకుంటామని ఎస్‌ఐ హెచ్చరించారు.

ధాన్యం శుభ్రం చేయించిన కమీషన్‌దారుడికి అడ్తి అసోసియేషన్ జరిమానా

సూర్యాపేట సిటీ, జనవరి 31: సూర్యాపేట జిల్లా కేంద్రంలోని వ్యవసాయ మార్కెట్‌లో రైతులు తీసుకువచ్చిన ధాన్యాన్ని కూలీలను పెట్టి శుభ్రం చేయించినందుకు బుధవారం ఓ కమీషన్‌దారుడికి అడ్తి అసోసియేషన్ జరిమానా విధించింది. నిబంధనల ప్రకారం మార్కెట్‌లో మార్కెట్‌లో ధాన్యం శుభ్రం చేసినందుకు రూ.5వేలు జరిమానా వేసినట్లు అడ్తి అసోసియేషన్ అధ్యక్షుడు ఓరుగంటి గోపాలరావు తెలిపారు. జరిమానా విషయం తన దృష్టికి రాలేదని మార్కెట్ కార్యదర్శి బీవీ రాహుల్ తెలిపారు. టెండర్‌కు ముందు వ్యవసాయ ఉత్పత్తులను శుభ్రం చేస్తే కలిగే లాభనష్టాలపై అడ్తి అసోసియేషన్ సభ్యులతో చర్చిస్తానన్నారు.అసోసియేషన్ తీరుపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ధాన్యం శుభ్రంగా ఉంటే మంచి ధర వస్తుంది. మంచి ధర వస్తే రైతులకు లాభం జరుగుతుంది కదా అని రైతులు ప్రశ్నిస్తున్నారు. ధాన్యం రాశులను శుభ్రం చేయిస్తే కమీషన్‌దారులకు కలిగే నష్టం ఏంటని రైతులు ప్రశ్నిస్తున్నారు. మార్కెట్ అంటే ఉత్పత్తులను విక్రయించే స్థలమని, అక్కడ ఉత్పత్తులను శుభ్రం చేసుకునే స్థలం కాదని, అందుకే జరిమానా విధించినట్లు అసోసియేషన్ సభ్యులు చెబుతున్నారు.

సాగర్ ఎడమ కాల్వకు నీటి విడుదల


ఎడమ కాల్వలోకి విడుదలవుతున్న నీరు

నాగార్జునసాగర్, జనవరి 31 : నాగార్జున సాగర్ ప్రాజెక్టు ఎడమ కాల్వకు అధికారులు బుధవారం సాయంత్రం నీటిని విడుదల చేశారు. ఖమ్మం పట్టణ తాగునీటి అవసరాల కోసం పాలేరు జలాశయాన్ని నింపేందుకు రోజుకు 6,000 క్యూసెక్కుల చొప్పున మూడు రోజుల పాటు రెండు టీఎంసీల మేర నీటిని విడుదల చేయనున్నట్లు అధికారులు తెలిపారు. నీటిని కేవలం తాగునీటి అవసరాలకు మాత్రమే వాడుకోవాలని, రైతులు మేజర్లు, మైనర్ల వద్ద షట్టర్లు ఎత్తి నీటిని వాడుకోరాదన్నారు. బుధవారం సాయంత్రం ఐదు గంటలకు 1000 క్యూసెక్కుల చొప్పున నీటి విడుదల ప్రారంభించి గంట, గంటకు 1000 క్యూసెక్కులు పెంచుతూ 6000 క్యూసెక్కుల వరకు విడుదల చేస్తామన్నారు. సాగర్ ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 590 అడుగులు (312.5050 టీఎంసీలు) కాగా ప్రస్తుతం 520 అడుగులుగా(149.2750 టీఎంసీలు) నమోదైంది. సాగర్ నుంచి ఎడమ కాల్వ ద్వారా 2,000 క్యూసెక్కులు, ఎస్ఎల్‌బీసీ ద్వారా జంట నగరాల తాగునీటి అవసరాల కోసం 900 క్యూసెక్కులు, ప్రధాన జలవిద్యుత్ కేంద్రంలో విద్యుదుత్పత్తి చేస్తూ 7,661 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. సాగర్ నుంచి మొత్తం 10,561 క్యూసెక్కుల నీరు విడుదల అవుతుండగా ఎగువ నుంచి ఎటువంటి నీటి రాక లేదు.

పంచాయతీల్లో ప్రత్యేక పాలన



- నేటి సాయంత్రంలోగా సర్పంచ్‌ల నుంచి రికార్డుల స్వాధీనం
- ఉమ్మడి జిల్లాలో 1,740 గ్రామాలకు అధికారుల నియామకం
- రేపటి నుంచి బాధ్యతలు చేపట్టనున్న ప్రత్యేక అధికారులు
- విద్యాశాఖ మినహా మిగతా శాఖల ఉద్యోగులకు బాధ్యతలు

నల్లగొండ/ సూర్యాపేట సిటీ, జనవరి 31 : ఉమ్మడి నల్లగొండ జిల్లాలోని 1,740 గ్రామపంచాయతీల్లో శుక్రవారం నుంచి ప్రత్యేక అధికారుల పాలన ప్రారంభం కానుంది. సర్పంచ్‌ల పదవీకాలం ఈ నెల 1న ముగుస్తుండటంతో ఇకపై పాలన బాధ్యతలను అధికారులు చేపట్టనున్నారు. పంచాయతీ ఎన్నికల నిర్వహణ ఇప్పట్లో సాధ్యం కాకపోవడంతో గ్రామాలకు ప్రత్యేక అధికారులను నియమించాలని ప్రభుత్వం నిర్ణయించింది. మూడు జిల్లాల నుంచి ప్రతిపాదించిన ప్రత్యేక అధికారుల జాబితాకు ఏ క్షణమైనా ఆమోదం లభించనుంది. విద్యాశాఖ ఉద్యోగులు మినహా ఇతర శాఖలన్నింటి నుంచి ఉద్యోగులను ప్రత్యేక అధికారులుగా తీసుకోనున్నారు. ఎంపీడీవోలు, తహసీల్దార్లు, ఉపతహసీల్దార్లు, పంచాయతీరాజ్ అసిస్టెంట్ ఇంజనీర్లు, గ్రామీణ నీటి సరఫరా విభాగం అసిస్టెంట్ ఇంజనీర్లు, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు, వ్యవసాయ, వెటర్నరీ, ఉద్యానశాఖ అధికారులు, ఆరోగ్యశాఖ సూపర్‌వైజర్లు, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్లు, మండల పరిషత్ సూపరింటెండెంట్లు, సీనియర్, జూనియర్ అసిస్టెంట్లు, వ్యవసాయ విస్తరణ అధికారులు, టైపిస్టులను ప్రత్యేక అధికారులుగా నియమించనున్నారు. నల్లగొండ జిల్లాలో 844గ్రామాలకు, సూర్యాపేట జిల్లాలో 475గ్రామాలకు, యాదాద్రి జిల్లాలో 421 గ్రామాలకు ప్రత్యేకఅధికారులను నియమించనున్నారు.

నేటి సాయంత్రంలోగా రికార్డులు స్వాధీనం

రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు ప్రత్యేక అధికారుల పాలన నేపథ్యంలో ఉమ్మడి నల్లగొండ జిల్లాలోని 1,740 గ్రామపంచాయతీలకు చెందిన రికార్డులను సర్పంచుల నుంచి గురువారం సాయంత్రం ఐదు గంటల్లోగా రికార్డులను స్వాధీనం చేసుకోనున్నారు. ఇప్పటికే అన్నిగ్రామాల సర్పంచ్‌లకు రికార్డులను అప్పగించాలని పంచాయతీరాజ్ శాఖ అధికారులు ఆదేశాలు జారీ చేశారు. సర్పంచ్‌లు, ఉపసర్పంచ్‌ల నుంచి రికార్డులు, చెక్ బుక్‌లు, డిజిటల్ బుక్‌ల కీలను స్వాధీన చేసుకోనున్నారు. గురువారంతో సర్పంచ్‌ల పదవీకాలం ముగుస్తున్నందున వాటిని స్వాధీనం చేసుకోవాలని నిర్ణయించారు. ఎవరైనా ప్రభుత్వ ఆదేశాలు పాటించకుండా రికార్డులు ఇవ్వకుండా నిర్లక్ష్యం చేస్తే క్రమశిక్షణ చర్యలు తీసుకోవాలని అధికారులు నిర్ణయించారు. ప్రస్తుతం డిజిటల్ సంతకాల కీలు పెన్ డ్రైవ్‌ల రూపంలో సర్పంచ్‌లు, ఉపసర్పంచ్‌ల వద్ద ఉన్నాయి. వాటిని పంచాయతీ కార్యదర్శులు సాధీనం చేసుకోనున్నారు. ఫిబ్రవరి 2 నుంచి విధుల్లో చేరనున్న ప్రత్యేక అధికారులకు ప్రభుత్వం డిజిటల్ సంతకాల కీలను ఇవ్వనుంది. ఇప్పటివరకు సర్పంచ్‌లు, ఉపసర్పంచ్‌లకు జాయింట్ చెక్‌పవర్ ఉండగా ఇకపై ప్రత్యేక అధికారి, పంచాయతీ కార్యదర్శికి జాయింట్ చెక్‌పవర్ ఇవ్వనున్నారు. అభివృద్ధి పనులకు సంబంధించి వారి ఇద్దరి సంతకాలతో నిధులు డ్రా చేసుకునే అవకాశం ఉంటుంది.

పాత బిల్లులు చెల్లించి ఆదుకోవాలి



గ్రామాన్ని అన్నిరంగాల్లో అభివృద్ధి చేశాం. గ్రామ అభివృద్ధి కోసం అప్పులు చేసి పనులు చేపట్టాం. తమ గ్రామంలో మన ఊరు మన బడి కోసం రూ.కోటి అప్పులు చేసి పనులు చేపట్టాం. నేటి వరకు నయా పైసా విడుదల కాలేదు. ప్రభుత్వం తక్షణమే స్పందించి బిల్లులు చెల్లించి ఆదుకోవాలి. సర్పంచ్‌గా పదవీకాలం సంతృప్తికరంగా ఉన్నా బిల్లులు రాకపోవడంతో ఆందోళన చెందుతున్నాం.

● దండ రేణుకఅశోక్‌రెడ్డి, సర్పంచ్, బైరవునిబండ, శాలిగౌరారం

స్పెషల్ ఆఫీసర్ల నియామకానికి ఏర్పాట్లు

ప్రభుత్వఆదేశాల మేరకు స్పెషల్ ఆఫీసర్ల నియామకానికి అన్ని ఏర్పాట్లుచేశాం. విద్యాశాఖ మినహా అన్ని ప్రభుత్వశాఖల నుంచి అధికారులను గుర్తించి స్పెషల్ ఆఫీసర్ల నియామకం కోసం ఒక జాబితాను రూపొందించాం. ప్రభుత్వం నుంచి ఉత్తర్వులు వెలువడగానే ప్రొసీడింగ్స్ ఇస్తారు. ప్రస్తుత సర్పంచ్‌లు శుక్రవారం 5 గంటల తరువాత డిజిటల్ కీ, చెక్‌బుక్‌లు అందజేయాల్సి ఉంటుంది.

● విష్ణువర్ధన్‌రెడ్డి, జిల్లా పంచాయతీ అధికారి

అక్రమంగా చెరువులో మట్టితవ్వకాలు చేపడితే చర్యలు

చండూరు రూరల్, జనవరి 31 : అనుమతుల్లేకుండా చెరువుల్లో మట్టి తవ్వకాలు చేపడితే చట్టపరమైన చర్యలు తప్పవని విజిలెన్స్ డీఈఈ బాలకృష్ణ హెచ్చరించారు. బుధవారం నల్లగొండ జిల్లా చండూరు మండలం ఇడికూడ, తాస్కానిగూడెం, కోటయ్యగూడెం గ్రామాల్లోని చెరువుల్లో విజిలెన్స్ అధికారులు, జిల్లా నీటిపారుదల శాఖ అధికారులు, భూగర్భగనుల శాఖ అధికారులు తనిఖీలు నిర్వహించారు. చర్లగూడెం రిజర్వాయర్ కోసం తరలిస్తున్న ఇడికూడ చెరువు మట్టిని అక్రమంగా ప్రైవేట్ వ్యక్తుల ఇటుక బట్టీలకు తరలిస్తున్నట్లు ఫిర్యాదులు రావడంతో తనిఖీలు చేపట్టినట్లు తెలిపారు. ఏ మేరకు అనుమతులున్నాయి, ఎంత మేరకు పూడిక తీస్తున్నారన్న వివరాలు అడిగి తెలుసుకున్నారు. సంబంధిత పత్రాలు చూపించాలని ఆదేశించారు. కాంట్రాక్టర్ ప్రస్తుతం అందుబాటులో లేరని మట్టిని తరలిస్తున్న సిబ్బంది తెలపడంతో అసహనం వ్యక్తం చేశారు. పెద్దఎత్తున మట్టిని తరలిస్తున్నా ఎందుకు నిర్లక్ష్యంగా ఉన్నారని స్థానిక అధికారులపై మండిపడ్డారు. వెంటనే మట్టిని తరలిస్తున్న వాహనాలను నిలిపివేశారు. చెరువుల్లో ఎక్కడపడితే అక్కడ పెద్దగుంతలను తీసి మట్టి తవ్వకాలు చేపట్టడంతో చెరువు కట్ట తెగిపోయే ప్రమాదం ఉందన్నారు. కనీస జాగ్రత్తలు తీసుకోకుండా మట్టిని తవ్వకాలు చేయడాన్ని గమనించి అధికారులను మందలించారు. సంబంధిత అధికారులు తవ్వకాలకు సంబంధించిన అనుమతిపత్రాలు అందజేసి, పూర్తి స్థాయి నివేదిక అందించాలన్నారు. ఆయన వెంట భూగర్భగనులశాఖ అధికారి నాగమని, నీటిపారుదల శాఖ ఏఈ రఘు, ఆర్ఐ మధు ఉన్నారు.

వైభవంగా లక్ష్మీనృసింహుల తిరుకల్యాణం

యాదగిరిగుట్ట, జనవరి 31: యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామి సన్నిధిలో బుధవారం నిత్యవిధి కైంకర్యాలు శ్రీవైష్ణవ పాంచరాత్రాగమ శాస్త్రరీతిలో వైభవంగా కొనసాగాయి. వేకువజామున గర్భాలయంలోని స్వయంభువులను సుప్రభాతంతో మేల్కొలిపిన ఆచార్యులు నిజాభిషేకం, నిత్యార్చనలు నిర్వహించారు. ప్రధానాలయ దక్షిణ నైరుతి దిశలోని ప్రాకార మండపంలో హోమ పూజలు చేపట్టి ఉత్సవమూర్తులకు గజవాహన సేవోత్సవం నిర్వహించారు. దేవతల సేనానాయకుడు విశ్వక్సేనుడికి తొలిపూజలతో కల్యాణతంతు కొనసాగింది. ప్రధానాలయ ముఖమండపంలో ఉత్సవమూర్తుల చెంత సువర్ణ పుష్పార్చనలు, అష్టోత్తర పూజల్లో భక్తులు కుటుంబసమేతంగా పాల్గొని మొక్కులు చెల్లించుకున్నారు. సాయంత్రం అలంకార వెండి జోడు సేవలు, సహస్రనామార్చనలు నిర్వహించారు. కొండపైన శివాలయంలో రామలింగేశ్వరుడికి నిత్యారాధనలు, కొండకింద వ్రత మండపంలో సత్యనారాయణస్వామి వ్రతాలు శైవాగమ పద్ధతిలో నిర్వహించారు. ఆలయ ఖజానాకు వివిధ విభాగాల ద్వారా రూ.15,65,336 ఆదాయం సమకూరిందని, సుమారు 10 వేల మంది లోపు భక్తులు యాదగిరిక్షేత్రాన్ని సందర్శించినట్టు దేవస్థాన అధికారులు తెలిపారు.


తిరువీధుల్లో వెండి జోడు సేవోత్సవం నిర్వహిస్తున్న అర్చకులు

దేవాదాయశాఖ మంత్రిని సన్మానించిన జేఏసీ చైర్మన్ రమేష్‌బాబు

రాష్ట్ర దేవాలయాల జాయింట్ యాక్షన్ కమిటీ చైర్మన్, గుట్ట ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు గజవెల్లి రమేష్‌బాబు బుధవారం దేవాదాయ ధర్మాదాయశాఖ మంత్రి కొండ సురేఖను ఘనంగా సన్మానించారు. హైదరాబాద్ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ సచివాలయంలోని మంత్రి ఛాంబర్‌లో మర్యాదపూర్వకంగా కలిసి శాలువా, పూలదండలతో సన్మానించి యాదగిరి లక్ష్మీనృసింహుడి చిత్రపటాన్ని అందజేశారు. ఈ సందర్భంగా రాష్ట్ర దేవాలయాల ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని ఆయన మంత్రిని కోరగా ఆమె సానుకూలంగా స్పందించినట్టు తెలిపారు. ముందుగా అర్చకబృందం, వేద పండితులు ఆమెకు స్వామివారి ఆశీస్సులు, తీర్థప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో గుట్ట ఉద్యోగుల సంఘం ఉపాధ్యక్షుడు జూశెట్టి కృష్ణ, దయానంద్, ప్రధానకార్యదర్శి మంద స్వామి, కోశాధికారి ముద్దసాని కృష్ణస్వామి, ఉపప్రధానార్చకులు సురేంద్రాచార్యులు, అర్చకులు కిరణ్‌కుమారాచార్యులు, అరుణ్‌కుమారాచార్యులు, వేదపండితులు పవన్‌కుమారశర్మ ఉన్నారు.

ఘర్షణకు దారితీసిన పంచాయతీ భవన ప్రారంభోత్సవం

నిడమనూరు, జనవరి 31 : నల్లగొండ జిల్లా నిడమనూరు మండలం పార్వతీపురంలో పంచాయతీ కార్యాలయ భవన ప్రారంభోత్సవం ఘర్షణకు దారితీసింది. బీఆర్ఎస్‌కు చెందిన సర్పంచ్ ఏర్పాట్లు చేయగా, ఎమ్మెల్యేను పిలవకుండా ఎలా ప్రారంభిస్తారని కాంగ్రెస్ నాయకులు అడ్డుకుని, శిలాఫలకాన్ని ధ్వంసం చేశారు. ఇరువర్గాలు ఈ ఘర్షణపై పోలీసులకు ఫిర్యాదు చేసుకున్నాయి. గ్రామంలో అరగంట పాటు ఉద్రిక్త పరిస్థితి నెలకొంది. ఇందుకు సంబంధించిన వివరాలిలా ఉన్నాయి. నిడమనూరు మండలం తుమ్మడం శివారులో ఉన్న పార్వతీపురాన్ని నూతన గ్రామపంచాయతీగా ఏర్పాటుచేయడంతో వంకా బ్రహ్మన్న పంచాయతీ మొదటి సర్పంచ్‌గా కాంగ్రెస్ తరఫున గెలిచారు. కొన్నాళ్ల తర్వాత ఆయన బీఆర్ఎస్‌లో చేరారు. పంచాయతీ భవనం కోసం ప్రభుత్వం రూ.20 లక్షల ఈజీఎస్ నిధులు మంజూరు చేయగా భవనం నిర్మించారు. నిర్మాణం పనులు ఇంకా పూర్తికాలేదు. భవనాన్ని పంచాయతీరాజ్ శాఖకు కూడా అప్పగించలేదు. కానీ సర్పంచ్ పదవీకాలం ముగుస్తుండటంతో నూతన భవనాన్ని ప్రారంభించేందుకు సర్పంచ్ బ్రహ్మన్న ఏర్పాట్లుచేశారు. కానీ స్థానిక ఎమ్మెల్యేకు గాని, సంబంధిత అధికారులకు ఎలాంటి సమాచారం ఇవ్వలేదు. భవనాన్ని ప్రారంభించేందుకు శిలాఫలకం ఏర్పాటుచేశారు. విషయం తెలుసుకున్న కాంగ్రెస్ కార్యకర్తలు అక్కడకు చేరుకుని స్థానిక ఎమ్మెల్యేను పిలవకుండా భవనాన్ని ఎలా ప్రారంభిస్తారని, ప్రొటోకాల్ పాటించరా అంటూ ప్రశ్నించారు. దీంతో ఇరువర్గాల నడుమ కొంతసేపు ఘర్షణ జరిగింది. కాంగ్రెస్ కార్యకర్తలు శిలాఫలకాన్ని ధ్వంసంచేశారు. విషయం తెలుసుకున్న పోలీసులు గ్రామానికి చేరుకుని ఇరువర్గాలను శాంతింపజేసి అక్కడినుంచి పంపించారు. సమాచారం తెలియడంతో మాజీ ఎమ్మెల్యే నోముల భగత్ బీఆర్ఎస్ నాయకులతో గ్రామాన్ని సందర్శించి కాంగ్రెస్ కార్యకర్తలు ధ్వంసం చేసిన పంచాయతీ శిలాఫలకాన్ని పరిశీలించారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ కాంగ్రెస్ నాయకుల చర్యను ఖండించారు. అభివృద్ధిలో పోటీపడాలి కానీ అధికారం ఉందన్న అహంతో దాడులు చేయడం సరికాదన్నారు. శిలాఫలకం ధ్వంసం చేసిన మద్దిపూడి రాంబాబు, వేములపల్లి వెంకట్‌రావు, కంచి శ్రీను, కుంభం విజయ్ అనే నలుగురు కాంగ్రెస్ కార్యకర్తలపై చర్యలు తీసుకోవాలని పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదుచేశారు. తమపై దురుసుగా ప్రవర్తించారని బీఆర్ఎస్‌కు చెందిన సర్పంచ్ వంకా బ్రహ్మన్న, గౌండ్ల సత్యనారాయణ, నక్క సైదులు, శివాల కృష్ణమూర్తిపై కాంగ్రెస్ కార్యకర్తలు కూడా పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.


కాంగ్రెస్ నాయకులు ధ్వంసం చేసిన శిలాఫలకాన్ని పరిశీలిస్తున్న మాజీ ఎమ్మెల్యే భగత్

బావమరిది హత్య కేసులో జీవితఖైదు

పెద్దఅడిశర్లపల్లి/ నల్లగొండ టౌన్, జనవరి 31 : బావమరిది హత్య కేసులో బావకు జీవితఖైదు పడింది. నల్లగొండ జిల్లా పెద్దఅడిశర్లపల్లి మండలం తిరుమలగిరి గ్రామానికి చెందిన సీత ముత్యాలుకు జీవితఖైదు విధిస్తూ నల్లగొండ సెషన్స్ జడ్జి ఎం నాగరాజు బుధవారం తీర్పునిచ్చారు. ఈ హత్య కేసు పూర్వాపరాలు ఇలా ఉన్నాయి.పీఏపల్లి మండలం మేడారం గ్రామానికి చెందిన అడ్ల మారయ్య కుమార్తె ముత్యాలమ్మను తిరుమలగిరి గ్రామానికి చెందిన సీత ముత్యాలుకు ఇచ్చి 20 ఏళ్ల క్రితం వివాహం చేశాడు. భార్యాభర్తల మధ్య గొడవలతో ముత్యాలమ్మ తల్లిగారింటికి వచ్చి ఉంటోంది. దీంతో పలుమార్లు పంచాయితీ పెట్టినా ఫలితం లేకపోవడంతో భార్య తన వద్దకు రాకపోవడానికి మామ మారయ్య, బావమరిది అంజయ్య కారణమని, వారిపై కక్ష పెంచుకుని 2017 మే 24నగొర్రెల షెడ్ ముందు నిద్రిస్తున్న బావమరిది అంజయ్యను గొడ్డలితో నరికి హత్య చేశాడు. అంజయ్య తండ్రి మారయ్య ఫిర్యాదు మేరకు నిందితుడు సీత ముత్యాలుపై కేసు నమోదు చేసి దర్యాప్తు కొనసాగించారు. అనంతరం ఆధారాలు కోర్టుకు సమర్పించగా బుధవారం విచారణ అనంతరం నిందితుడు ముత్యాలుకు జీవితఖైదు విధిస్తూ తీర్పునిచ్చారు. కేసు విషయంలో సరైన ఆధారాలు సేకరించి కోర్టుకు అందజేసి నిందితుడికి శిక్ష పడేలా చేసిన ఇన్వెస్టిగేషన్ ఆఫీసర్స్ కె.శివరాంరెడ్డి, ఏ.రంజిత్‌రెడ్డి, పీపీ నందనపల్లి శ్రీనివాస్, పీసీలు శంకర్‌రాజు, సీడీవో వెంకటేశ్వర్లు, నరేందర్, మల్లిఖార్జున్‌ను నల్లగొండ జిల్లా ఎస్పీ చందనాదీప్తి అభినందించారు.

బెదిరించి నగదు చోరీ

నేరేడుచర్ల, జనవరి 31 : గుర్తు తెలియని ముగ్గురు వ్యక్తులు ఆటోను ఆపి యజమానిని బెదిరించి చోరీ చేశారు. ఈ సంఘటన సూర్యాపేట జిల్లా నేరేడుచర్ల మండలంలో మంగళవారం చోటుచేసుకుంది. ఎస్ఐ పరమేష్ తెలిపిన వివరాల ప్రకారం నేరేడుచర్ల మండలం పెంచికల్‌దిన్న గ్రామానికి చెందిన బెందు వీరబాబు(42) భార్యతో కలిసి ఊరూరు తిరిగి కూరగాయల విక్రయిస్తుంటాడు. ప్రతి రోజూ ఉదయం మూడు గంటల సమయంలో వీరబాబు ఒక్కడే ఆటోలో నేరేడుచర్ల మండలం పెంచికల్‌దిన్న గ్రామం నుంచి నల్లగొండ జిల్లా మిర్యాలగూడ కూరగాయల మార్కెట్‌కు వెళ్లి కూరగాయలు కొనుగోలు చేసి ఇంటికి వచ్చి భార్యతో కలసి కూరగాయలు విక్రయిస్తూ జీవనం సాగిస్తారు. రోజు మాదిరిగానే మంగళవారం తెల్లవారుజామున పెంచికల్‌దిన్న నుంచి తెలగరామయ్యగూడెం మీదుగా బోడలదిన్న శివారుకు రాగానే బైక్‌పై వెనక నుంచి వచ్చిన ముగ్గురు గుర్తు తెలియని వ్యక్తులు ఆటోను అడ్డగించి ఆటోలో ఉన్న యజమాని వీరబాబును బెదిరించి ఆయన వద్ద ఉన్న రూ.15వేల నగదు, 6 గ్రాముల బంగారపు ఉంగరాన్ని బలవంతంగా తీసుకెళ్లినట్లు తెలిపారు. బాధితుడి ఫిర్యాదు మేరకు ఎస్ఐ పరమేష్ కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. సీఐ రామలింగారెడ్డి ఆదేశాలమేరకు స్పెషల్‌టీంను ఏర్పాటు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

మహిళ మెడలో నుంచి బంగారు పుస్తెలతాడు అపహరణ

చౌటుప్పల్ రూరల్, జనవరి 31: యాదాద్రిభువనగిరి జిల్లా చౌటుప్పల్ మండలం దండుమల్కాపురం జాతీయరహదారిపై మంగళవారం రాత్రి గుర్తుతెలియని వ్యక్తులు మహిళ మెడ నుంచి నాలుగు తులాల బంగారు పుస్తెలతాడును అపహరించారు. చౌటుప్పల్‌కు చెందిన ఓ మహిళ దండుమల్కాపురం అందోళ్‌మైసమ్మ దేవాయలం సమీపంలో రోడ్డుపై నిలబడి ఓ వ్యక్తితో మాట్లాడుతుండగా బైక్‌పై వచ్చిన ఇద్దరు యువకులు మహిళ మెడ నుంచి బంగారు పుస్తెలతాడును అపహరించి పారిపోయారు. ఈ మేరకు ఆ మహిళ చౌటుప్పల్ పోలీసులకు ఫిర్యాదు చేసింది. సంఘటనా స్థలాన్ని ఏసీపీ మొగిలయ్య, సీఐ అశోక్‌రెడ్డి పరిశీలించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్టు సీఐ తెలిపారు.

మూత్రవిసర్జనకు రైలు దిగిన బాలుడు

- తిరిగి వచ్చేసరికి వెళ్లిపోయిన రైలు
- దర్యాప్తు చేసి అక్కకు అప్పగించిన రైల్వే పోలీసులు

భువనగిరి టౌన్, జనవరి 31: మూత్రవిసర్జన కోసం రైలు నుంచి దిగిన బాలుడిని బుధవారం యాదాద్రిభువనగిరి జిల్లా కేంద్రంలోని రైల్వే పోలీసులు, బాలల పరిరక్షణ విభాగం అధికారులు కుటుంబసభ్యులకు అప్పగించారు. ఇందుకు సంబంధించిన వివరాలిలా ఉన్నాయి. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కొత్తగూడెం పట్టణానికి చెందిన రాజు భార్య శివాద్రి అనారోగ్యానికి గురికావడంతో వైద్యచికిత్సల నిమిత్తం హైదరాబాద్‌లోని ఓ ఆసుపత్రిలో చేర్పించారు.భార్యతో పాటు భర్త కూడా ఆసుపత్రిలోనే ఉంటున్నాడు. ఈ నేపథ్యంలో తల్లిని చూసేందుకు బుధవారం కొత్తగూడెం నుంచి వారి పిల్లలు లోకేష్(13), జియాద్రి(16) కాకతీయ రైలులో బయలుదేరారు. ఈ క్రమంలో రైలు భువనగిరి రైల్వేస్టేషన్‌కు చేరుకున్న వెంటనే లోకేష్ మూత్రవిసర్జన కోసం దిగాడు. తిరిగి రైలు వద్దకు చేరుకునే లోపే రైలు వెళ్లిపోయింది. దీంతో లోకేష్ ఆందోళనగా రైల్వే ఫ్లాట్‌ఫాంపై తిరుగుతుండగా గమనించిన రైల్వేపోలీసులు ఆరాతీశారు. అతడు చెప్పిన ఫోన్ నెంబర్ ఆధారంగా రైలులో వెళ్తున్న జియాద్రికి ఫోన్ చేశారు. అప్పటికే తమ్ముడి కోసం రైలులో వెతుకుతున్న జియాద్రి రైల్వే పోలీసుల నుంచి వచ్చిన ఫోన్ సమాచారం ఆధారంగా బీబీనగర్ రైల్వే స్టేషన్‌లో దిగి రోడ్డు మార్గంలో భువనగిరి రైల్వేస్టేషన్‌కు చేరుకుంది. అప్పటికే రైల్వే పోలీసులు చైల్డ్ లైన్ టోల్‌ఫ్రీ నెంబర్‌కు సమాచారమిచ్చారు. లోకేష్‌ను, జియాద్రిని వేర్వేరుగా విచారించి ఇరువురు అక్కాతమ్ముడిగా నిర్ధారించుకున్నారు. అనంతరం లోకేష్‌ను ఆర్‌పీఎఫ్ ఏఎస్ఐ మోయినొద్దీన్ ఉమెన్, జీఆర్‌పీ హెడ్ కానిస్టేబుల్స్ కృష్ణారావు, సత్యనారాయణ, చైల్డ్ లైన్ కోఆర్డినేటర్ దశరథ తదితర అధికారులు సిబ్బంది అక్క జియాద్రికి అప్పగించడంతో కథ సుఖాంతమైంది.


రైల్వేస్టేషన్‌లో లోకేష్‌ను అక్క జియాద్రికి అప్పగిస్తున్న రైల్వే పోలీసులు

నియోజకవర్గ సమగ్రాభివృద్ధికి కృషి

ఎమ్మెల్యే నలమాద పద్మావతిరెడ్డి

చిలుకూరు, జనవరి 31: కోదాడ నియోజకవర్గ సమగ్రాభివృద్ధికి కృషి చేస్తానని ఎమ్మెల్యే నలమాద పద్మావతిరెడ్డి అన్నారు. బుధవారం మండల కేంద్రంతో పాటు బేతవోలు, జెర్రిపోతులగూడెం, చెన్నారిగూడెం, ఆచార్యుల గూడెం, రామాపురం గ్రామాల్లో పలు అభివృద్ధి పనులను జడ్పీ చైర్ పర్సన్ దీపికతో కలిసి ఆమె ప్రారంభించి మాట్లాడారు. ఆచార్యులగూడెంలో వంతెన, బేతవోలు గ్రామంలో అంగన్‌వాడీ కేంద్రాల భవనాలు, సీసీ రోడ్లు, జెర్రిపోతులగూడెంలో పాఠశాల భవనం, సీసీ రోడ్లు, చెన్నారిగూడెంలో పల్లె దవాఖాన, సీసీరోడ్లు, డ్రైనేజీలు, రామాపురంలో పాఠశాల భవనం, చిలుకూరులో సీసీ రోడ్లను ప్రారంభించారు. చిలుకూరులో నూతనంగా నిర్మిస్తున్న గ్రంథాలయ భవనాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లో ఎమ్మెల్యేను పలువురు సన్మానించారు. కార్యక్రమంలో ఎంపీపీ ప్రశాంతి, జడ్పీటీసీ శిరీష, వైస్ ఎంపీపీ జానకి, ఎంపీడీవో ఈదయ్య, డీఈ సతీష్‌బాబు, పీఆర్ ఏఈ లక్ష్మారెడ్డి, ఎంఈవో సలీం షరీఫ్, సర్పంచ్‌లు చంద్రకళ, కొడారు బాబు, సుజాత, గంగా లింగయ్య, కమతం కొండలు, మాజీ ఎంపీపీ బజ్జూరి వెంకటరెడ్డి, ఎంపీటీసీలు ధనమూర్తి, సైదాబాబు పాల్గొన్నారు.

మేధస్సును పెంపొందించే చెకుముకి పోటీలు

మునగాల: చెకుముకి పోటీలు విద్యార్థుల మేధస్సును పెంపొందిస్తాయని ఎమ్మెల్యే పద్మావతిరెడ్డి అన్నారు. మండల కేంద్రంలో ఈ నెల మూడో తేదీన నిర్వహించే చెకుముకి పోటీల వాల్ పోస్టర్‌ను ఆవిష్కంచి మాట్లాడారు కార్యక్రమంలో ఎంపీపీ ఎలక బిందునరేందర్‌రెడ్డి, కొప్పుల జైపాల్‌రెడ్డి, నల్లపాటి శ్రీనివాస్, బుచ్చిపాపయ్య, ఉప్పుల రజిత్, కాసర్ల కల్పనశ్రీనివాస్, ఓరుగంటి రవి, గోళ్లముడి రమేష్, తదితరులు పాల్గొన్నారు.

● గుడిసెలు వేసుకుని నివసిస్తున్న పేదలకు పట్టా హక్కులు కల్పించాలని వ్యకా.స. జిల్లా అధ్యక్షుడు ముల్కలపల్లి రాములు కోరారు. ఈ మేరకు మండల కేంద్రంలో ఎమ్మెల్యే పద్మావతిరెడ్డికి వినతిపత్రం అందజేశారు.

రేపాల మండలాన్ని ఏర్పాటు చేయాలి

మునగాల రూరల్: మండలంలోని రేపాల గ్రామాన్ని ప్రత్యేక మండలంగా ఏర్పాటు చేయాలని రేపాల మండల సాధన సమితి నాయకులు కోరారు. రేపాల గ్రామంలోని సీసీ రోడ్డు ప్రారంభోత్సవానికి బుధవారం వచ్చిన ఎమ్మెల్యే పద్మావతిరెడ్డికి ఈ మేరకు వినతిపత్రం అందజేశారు. నాన్ కెనాల్ కింద ఉన్న 11గ్రామపంచాయతీలను కలుపుతూ ప్రత్యేకంగా నూతన రూరల్ మండలం ఏర్పాటు చేయాలన్నారు. ఈ అంశాన్ని అసెంబ్లీలో ప్రస్తావిస్తానని ఎమ్మెల్యే హామీ ఇచ్చిరు. కార్యక్రమంలో రేపాల, విజయరాఘవపురం, తాడ్వాయి, మాధవరం, సీతానగరం గ్రామాల జేఏసీ నాయకులు పాల్గొన్నారు.



ఆచార్యులగూడెంలో వంతెనను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే పద్మావతిరెడ్డి, జడ్పీ చైర్‌పర్సన్ దీపిక

కాంగ్రెస్‌లో చేరిన కిరణ్మయి, వీరభద్రరావు దంపతులు

హుజూర్‌నగర్ రూరల్, జనవరి 31: నియోజకవర్గానికి చెందిన చావా కిరణ్మయి, వీరభద్రరావు దంపతులు తమ అనుచరులతో హైదరాబాద్‌లో భారీ నీటిపారుదల శాఖామంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి సమక్షంలో బుధవారం కాంగ్రెస్‌లో చేరారు. 1987లో రాజకీయ రంగ ప్రవేశం చేసిన చావా కిరణ్మయి 2001లో జడ్పీటీసీగా, 2007లో ఎంపీటీసీగా ఎన్నికయ్యారు. ఉమ్మడి నల్లగొండ జిల్లా సోషల్ వేల్ఫేర్ స్టాండింగ్ కమిటీ సభ్యురాలిగా ప చేశారు. 2019లో హుజూర్‌నగర్ ఉప ఎన్నికలో టీడీపీ అభ్యర్థిగా పోటీ చేసి ఓడిపోయారు. టీడీపీలో పలు హోదాల్లో పనిచేశారు. శ్రీనివాసాపురం గ్రామానికి వీరభద్రరావు రెండు పర్యాయాలు సర్పంచ్‌గా, ఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడిగా రెండు దఫాలు పనిచేశారు. ప్రస్తుతం రైతు సమన్వయ సమితి జిల్లా డైరెక్టరుగా కొనసాగుతూ కాంగ్రెస్‌లో చేరారు.

బాధ్యతలు స్వీకరించిన ఎస్‌ఐలు



ఏడుకొండలు



సైదులు

తుంగతుర్తి, ఆత్మకూరు(ఎస్), జనవరి 31: తుంగతుర్తి ఎస్ఐగా ఏడుకొండలు, ఆత్మకూర్ (ఎస్)ఎస్ఐగా సైదులు బుధవారం బాధ్యతలు స్వీకరించారు. తుంగతుర్తి ఎస్ఐగా పనిచేసిన ఎస్ఐ ప్రవీణ్‌కుమార్ సూర్యాపేటకు బదిలీ అయ్యారు. నడిగూడెం ఎస్ఐ ఏడుకొండలు బది లీపై తుంగతుర్తికి వచ్చారు. ఆత్మకూర్(ఎస్)ఎస్ఐగా పనిచేసిన వెంకట్‌రెడ్డిని వీఆర్‌లో ఉంచారు. నాగారం ఎస్ఐ వై.సైదులును ఆత్మకూర్(ఎస్)కు బదిలీ చేశారు.

కేసీఆర్ నీచరాజకీయాలను మానుకోవాలి

సూర్యాపేటఅర్బన్, జనవరి 31: మాజీ సీఎం కేసీఆర్ నీచ రాజకీయాలనుమానుకోవాలని టీజేఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు నారబోయిన కిరణ్ అన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలోని ఆ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఉద్యమ నాయకుడు చట్టసభల్లోకి వస్తున్నాడని భయపడి కోర్టులో కేసీఆర్ కేసు వేయించినందున కొదండరాం ప్రమాణ స్వీకారం వాయిదాపడిందని మండిపడ్డారు. కార్యక్రమంలో ఎస్సీ సెల్ జిల్లా కన్వీనర్ బచ్చలకూరి గోపి, వినయ్‌గౌడ్, సుమన్‌నాయక్, యాకుబ్‌రెడ్డి, గోపి, మల్సూర్‌నాయక్, రాంబాబుగౌడ్, నవీన్, కార్తీక్, శ్రీను పాల్గొన్నారు.

సర్పంచ్‌పై వచ్చిన ఆరోపణలపై ఐదు బృందాల విచారణ

మఠంపల్లి, జనవరి 31: పంచాయతీ నిధులు దుర్వినియోగం చేశాడని మఠంపల్లి సర్పంచ్ మన్నెం శ్రీనివాసరెడ్డిపై వచ్చిన ఆరోపణలపై అధికారులు ఐదు బృందాలుగా ఏర్పడి విచారణ చేస్తున్నారు. సర్పంచ్ శ్రీనివాసరెడ్డి పంచాయతీ నిధులు రూ.74.84లక్షలను అక్రమంగా డ్రా చేశారని వార్డు సభ్యులు, గ్రామస్థులు కలెక్టర్‌కు ఇటీవల ఫిర్యాదు చేశారు. దీంతో సర్పంచ్ చెక్‌పవర్ రద్దు చేయడంతో నిధుల రికవరీకి కలెక్టర్ ఆదేశాలు జారీ చేశారు. దీంతో నిధులు దుర్వినియోగంలో వాస్తవాలు వెలికితీసేందుకు కోదాడ, చిలుకూరు, అనంతగిరి, మునగాల, మోతె, మఠంపల్లి ఎంపీవోలు, పీఆర్ ఏఈలు ఐదు బృందాలుగా ఏర్పడి మూకుమ్మడి విచారణ చేపట్టారు. మఠంపల్లిలో చేపట్టిన సంక్షేమ అభివృద్ధి పనులు, రోడ్లు, రహదారులు, డ్రైనేజీలు, వీధి లైట్లు ఏర్పాటు తదితర అంశాలపై తనిఖీలు చేసి ఆయా కాలనీల ప్రజలను బహిరంగంగా విచారించారు. పరిశ్రమ యాజమాన్యం చేసిన అభివృద్ధి పనులకు గ్రామ పంచాయతీ నుంచి బిల్లులు డ్రా చేశారా? గ్రామ పంచాయతీ నిధులు, 14, 15వ ఆర్థిక సంఘం నిధులను ఎలా ఖర్చు చేశారు? అనే విషయాలపై ఆరా తీశారు. కార్యక్రమంలో ఎంపీవోలు హరిసింగ్, పాండురంగ, భూపాల్‌రెడ్డి, ఇబ్రహీం, టి.నాగేశ్వరావు, అంజనేయులు పీఆర్ ఏఈలు పాల్గొన్నారు.

సర్పంచ్‌పై చర్యలు తీసుకోవాలి: పాలకవర్గం

మేళ్లచెర్వు, జనవరి 31: మండలంలోని రామాపురం గ్రామ సర్పంచ్ షైలా మల్లికార్జున్‌రావుపై చర్యలు తీసుకోవాలని గ్రామ పంచాయతీ పాలకవర్గ సభ్యులు, గ్రామస్థులు కలెక్టర్ వెంకట్రావ్‌కు బుధవారం ఫిర్యాదు చేశారు. రామాపురం గ్రామ పంచాయతీకి చెందిన సాధారణ నిధులతో పాటుగా ఎన్ఆర్‌జీఎస్ నిధులను సర్పంచ్ దుర్వినియోగం చేశారని, గ్రామపంచాయతీ సిబ్బందిని, వాహనాలను, తన సొంత ప్రయోజనాలకు వినియోగించుకుని గ్రామపంచాయతీ నిధులను దారి మళ్లించాడని ఆరోపించారు. సర్పంచ్‌పై పూర్తిస్థాయిలో విచారణ జరిపించి చర్యలు తీసుకోవాలని కోరారు. కలెక్టర్‌కు ఫిర్యాదు చేసినవారిలో గ్రామపంచాయతీ వార్డు మెంబర్లు శివంగుల రామనర్సయ్య, చాట్ల ప్రభాకర్, నూకల లక్ష్మి, సోమగాని హైమావతి, కొట్టె సైదేశ్వరరావు, రంగిశెట్టి సైదయ్య, రంగిశెట్టి వెంకయ్య ఉన్నారు.

లంబాడీ హక్కుల ఐక్యవేదిక జిల్లా అధ్యక్షుడిగా పరదేష్‌నాయక్

తిరుమలగిరి, జనవరి 31: లంబాడీ హక్కుల ఐక్యవేదిక జిల్లా అధ్యక్షుడిగా తిరుమలగిరి మునిసిపాలిటీ పరిధిలోని ఈదులపర్రెతండాకు చెందిన భూక్యా పరదేష్ నాయక్‌ను నియమించారు. ఈ మేరకు ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు రాజ్‌కుమార్ జాదవ్, రాష్ట్ర సమన్వయకర్త గుగులోతు రమేష్‌నాయక్ ఆదేశాలు జారీ చేశారు.

హక్కులపై ప్రతి ఒక్కరికీ అవగాహన ఉండాలి

సూర్యాపేటరూరల్, మఠంపల్లి, పాలకవీడు, జనవరి 31: రాజ్యాంగం కల్పించిన పౌరహక్కులపై ప్రతి ఒక్కరికీ అవగాహన ఉండాలని ఎంపీపీ బీరవోలు రవీందర్‌రెడ్డి, జడ్పీటీసీ జీడీ భిక్షం, మఠంపల్లి తహసీల్దార్ మంగారాథోడ్, పాలకవీడు తహసీల్దార్ శ్రీదేవి అన్నారు. బుధవారం మండలంలోని సోలిపేట గ్రామంలో, మఠంపల్లి మండలం యాతవాకిళ్ల గ్రామంలో, పాలకవీడు మండలం శూన్యపహాడ్ గ్రామంలో పౌర హక్కుల దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. దళితులు అన్ని రంగాల్లో రాణించాలన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ బీరవోలు శోభారాణి, వైస్ ఎంపీపీ శ్రీనివాస్‌నాయుడు, ఉప సర్పంచ్ నర్ర సుగుణమ్మ, కార్యదర్శి చంద్రశేఖర్, మఠంపల్లిలో ఏఆర్ఐ గిరిప్రసాద్, సర్పంచ్ లక్ష్మీనరసింహరాజు, శూన్యపహాడ్‌లో ఎస్ఐ లింగయ్య, సర్పంచ్ బిక్కీ పాల్గొన్నారు.

సంప్రదాయబద్ధంగా లక్ష్మీనృసింహుని కల్యాణం

మఠంపల్లి, జనవరి 31: మట్టపల్లి క్షేత్రంలో బుధవారం లక్ష్మీనృసింహుని నిత్య కల్యాణాన్ని సంప్రదాయబద్ధంగా నిర్వహించారు. పూజల అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్తలు చెన్నూరి విజయ్‌కుమార్, మట్టపల్లిరావు, ఈవో నవీన్, అర్చకులు పాల్గొన్నారు.

సర్పంచుల సేవలు మరువలేనివి



అర్వపల్లిలో సర్పంచ్‌లను సన్మానిస్తున్న ఎంపీపీ మన్నె రేణుక

తుంగతుర్తి, అర్వపల్లి, ఆత్మకూర్(ఎస్) జనవరి 31: గ్రామాల అభివృద్ధిలో సర్పంచులు చేసిన సేవలు మరువలేనివని తుంగతుర్తి, అర్వపల్లి, ఆత్మకూర్(ఎస్)ఎంపీపీలు గుండగాని కవితరాములుగౌడ్, మన్నె రేణుకలక్ష్మీనర్సుయాదవ్, మర్ల స్వర్ణలతచంద్రారెడ్డి అన్నారు. సర్పంచ్‌ల పదవీకాలం ముగుసినందున ఆయా మండల పరిషత్ కార్యాలయాల్లో సర్పంచ్‌లను సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. తుంగతుర్తిలో వైస్ ఎంపీపీ మట్టిపల్లి శ్రీశైలం, డీసీసీబీ డైరెక్టర్ గుడిపాటి సైదులు, ఎంపీడీవో భీమ్‌సింగ్, ఆత్మకూర్ (ఎస్)లో ఎంపీడీవో మల్సూర్‌నాయక్, వైఎస్ ఎంపీపీ వెంకన్న, ఎంపీవో సంజీవ్, ఏపీవో ఈశ్వర్, ఎంఈవో ధారాసింగ్ పాల్గొన్నారు.

మొదట జైలుకు వెళ్లేది ఎమ్మెల్యే జగదీష్‌రెడ్డే

తిరుమలగిరి, జనవరి 31: బీఆర్ఎస్ నాయకుల అవినీతిపై కాంగ్రెస్ ప్రభుత్వం విచారణ ప్రారంభించిందని, వాస్తవాలు తేలితే మొదట జైలుకు వెళ్లేది మాజీ మంత్రి, ఎమ్మెల్యే జగదీష్‌రెడ్డేనని ఎమ్మెల్యే మందుల సామేల్ అన్నారు. బుధవారం తిరుమలగిరి మునిసిపాలిటీ కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు.మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డిపై జగదీష్‌రెడ్డి స్థాయికి మించి మాట్లాడుతున్నాడని అన్నారు. మంత్రిగా జగదీష్‌రెడ్డి అవినీతికి పాల్పడిన చిట్టా తన వద్ద ఉందని, దీనిపై బహిరంగ చర్యకు సిద్ధమా? అని సవాల్ విసిరారు. అడ్డగూడూరు వద్ద నిర్మించిన గోదాం ప్రారంభోత్సవాన్ని నిలిపివేయించిన చరిత్ర జగదీష్‌రెడ్డిదని అన్నారు. ఎన్నికల్లో బీఆర్ఎస్ నేతలకు ప్రజలు బుద్ధి చెప్పినా తీరుమారలేదన్నారు. సమావేశంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ఎల్సోజు నరేష్, పట్టణ అధ్యక్షుడు పేరాల వీరేష్, ఎంపీటీసీ జుమ్మీలాల్, కౌన్సిలర్ భాస్కర్, పాలకుర్తి రాజయ్య, సుంకరి జనార్దన్, బత్తుల శ్రీను, తిరుమని యాదగిరి, కందుకూరి లక్ష్మయ్య, ఉపేందర్, మోహన్, యాకయ్య తదితరులు పాల్గొన్నారు.



తిరుమలగిరిలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే మందుల సామేల్

ఖాతాదారుల నమ్మకాన్ని పొందిన సుధాబ్యాంక్



డాక్టర్ శోభారాజును సన్మానిస్తున్న మాజీమంత్రి దామోదర్‌రెడ్డి, సుధాబ్యాంక్ సభ్యులు

సూర్యాపేటటౌన్, జనవరి 31: ఖాతాదారుల నమ్మకాన్ని సుధా బ్యాంక్ పొందిందని మాజీ మంత్రి రాంరెడ్డి దామోదర్‌రెడ్డి అన్నారు. సుధా బ్యాంకు వార్షికోత్సవం పురస్కరించుకొని బుధవారం జిల్లా కేంద్రంలోని ఓ ప్రైవేటు ఫంక్షన్‌హాల్‌లో ఏర్పాటుచేసిన త్యాగరాజ ఆరాధనోత్సవాల్లో పాల్గొని మాట్లాడారు. 21 సంవత్సరాలుగా త్యాగరాజ ఆరాధనోత్సవాలు నిర్వహించడం అబినందనీయమన్నారు. సుధా బ్యాంక్ 24వ వార్షికోత్సవం నిర్వహించుకోవడం అభినందనీయమన్నారు. ఇప్పటికే ఎనిమిది శాఖల ద్వారా లక్షలాదిమంది ఖాతాదారుల సేవలు అందించడం గొప్ప విషయమన్నారు. మీలా సత్యనారాయణ స్ఫూర్తిని కొనసాగించేలా సుధా బ్యాంక్ ద్వారా సేవలను విస్తృతం చేయాలన్నారు. . భారతీయ సంస్కృతీసంప్రదాయాలను కాపాడేలా అనేక కార్యక్రమాలు నిర్వహిస్తున్న సుధాబ్యాంక్ ఆదర్శంగా ఉందన్నారు. అనంతరం పద్మశ్రీ అవార్డు గ్రహీత, అన్నమాచార్య భావన వాహిని ట్రస్టు చైర్మన్ డాక్టర్ శోభారాజును సన్మానించారు. ఈ సందర్భంగా ఆమె పాడిన అన్నమయ్య కీర్తనలు, విద్యార్థుల నృత్యాలు వీక్షకులను అలరించాయి. కార్యక్రమంలో సుధాబ్యాంక్ చైర్మన్ మీలా మహదేవ్, మేనేజింగ్ డైరెక్టర్ పెద్దిరెడ్డి గణేష్, వైస్ చైర్మన్ పొనుగోటి నిర్మల, పెద్దిరెడ్డి రాజా, ఇమ్మడి సోమనర్సయ్య, పోతు భాస్కర్, రంగాచార్యులు, శశిధర్, భాస్కర్, అనంతుల ప్రభాకర్, శంకర్‌లాల్, ఏపూరి శ్రవణ్‌కుమార్, మీలా సందీప్‌కుమార్ పాల్గొన్నారు.

కస్తూర్బా పాఠశాలకు ఫ్యాన్లు అందజేత

సూర్యాపేట రూరల్, జనవరి 31: మండలంలోని ఇమాంపేట పరిధిలోని కస్తూర్బా మైనార్టీ గురుకుల పాఠశాలకు సూర్యాపేట పట్టణానికి చెందిన కౌన్సిలర్ వెలుగు వెంకన్న రూ.30వేల విలువైన 10సీలింగ్ ఫ్యాన్లను బుధవారం అందజేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పిల్లల రమేనాయుడు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పశువులకు ముందస్తుగా టీకాలు వేయించాలి

మేళ్లచెర్వు, జనవరి 31: సీజనల్ వ్యాధులు రాకుండా పశువులకు ముందస్తు టీకాలు వేయించాలని మైహోం సిమెంట్ పరిశ్రమ ప్రెసిడెంట్ ఎం.శ్రీనివాసరావు అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని ప్రభుత్వ పశువైద్యశాలలో మైహోం సిమెంట్ ఆధ్వర్యంలో జిల్లా పశువైద్య, పశుసంవర్ధక శాఖను సంయుక్తంగా ఏర్పాటుచేసిన ఉచిత మెగా పశువైద్య శిబిరాన్ని జిల్లా వెటర్నరీ అధికారి శ్రీనివాస్‌తో కలిసి ఆయన ప్రారంభించి మాట్లాడారు. కార్యక్రమంలో మండల పశువైద్యాధికారి ఉషారాణి, శ్రీనివాస్‌రెడ్డి, జీఎం డాక్టర్ కె.నాగేశ్వరరావు, జగన్నాథరావు, రత్నం, ఏజీఎం శ్రీనివాస్, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

ఫణిగిరి బౌద్ధ క్షేత్రాన్ని అభివృద్ధి చేయాలి

నాగారం, జనవరి 31: మండలంలోని ఫణిగిరి బౌద్ధ క్షేత్రాన్ని అభివృద్ధి చేయాలని బోధిసత్వ ఫౌండేషన్ చైర్మన్ పులిగిల్ల వీరమల్లుయాదవ్ కోరారు. ఈ మేరకు సచివాలయంలో రోడ్లు, భవనాల శాఖమంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డిని బుధవారం కలిసి వినతిపత్రం అందజేశారు. ఫణిగిరిలో క్రీ.శ 3వ శతాబ్దం నాటి బౌద్ధారామాలు, శిల్పాలు ఉన్నాయని వాటిని చూడాడనికి ప్రపంచ టూరిస్టులు, బౌద్ధ భిక్షువులు వస్తున్నారని తెలిపారు. టూరిస్టుల సౌకర్యార్థంగ ఫణిగిరలో వసతి గృహాలు, మ్యూజియం ఏర్పాటు చేయాల, బౌద్ధ క్షేత్రాన్ని రోడ్డును నిర్మించాలని కోరారు., మంత్రి సానుకులంగా స్పందించినట్లు ఆయన తెలిపారు.

తాపీ మేస్త్రికి ఆర్థికసాయం

అర్వపల్లి, జనవరి 31: మండల కేంద్రానికి చెందిన తాపీ మేస్త్రి అరిగె నాగరాజు కొంత కాలం నుంచి అనారోగ్యంతో బాధపడుతుండగా, ఆయనకు వైద్య ఖర్చుల కోసం రాంకో సిమెంట్ లిమిటెడ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ సాయిశంకర్ రూ.25వేల చెక్కును బుధవారం అందజేశారు. కార్యక్రమంలో బాలకృష్ణ, మొరిశెట్టి రాంమూర్తి, ఎల్లేష్, జానకి, మధుసూదన్, లింగమల్లు పాల్గొన్నారు.

ప్రభుత్వ భూముల కబ్జాలను వెలికితీయాలి

సూర్యాపేటటౌన్, జనవరి 31: ప్రభుత్వ భూముల కబ్జాలను వెలికితీసి పేదలకు పంచాలని సీపీఐ(ఎంఎల్)ప్రజాపంథా జిల్లా కార్యదర్శి కొత్తపల్లి శివకుమార్ కోరారు. సూర్యాపేటలోని జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో బుధవారం నిర్వహించిన ప్రజాదర్బార్‌లో మాజీ మంత్రి రాంరెడ్డి దామోదర్‌రెడ్డికి వినతిపత్రం అందజేసి మాట్లాడారు. గత ప్రభుత్వం హయాంలో కుడకుడ ప్రాంతంలోని సర్వే నెం.126లో ఉన్న ప్రభుత్వ భూమిని బీఆర్ఎస్ నాయకులు ఆక్రమించుకుని జీవో నెం.59 ద్వారా అక్రమంగా పట్టాలు చేయించుకున్నారన్నారు. ఈ విషయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకువెళతానిని దామోదర్‌రెడ్డి హామీ ఇచ్చారు.. కార్యక్రమంలో నాయకులు కారింగుల వెంకన్న, కొత్తపల్లి రేణుక, ఎర్ర అఖిల్‌కుమార్, నాగయ్య, నర్సయ్య, సయ్యద్, రమేష్ పాల్గొన్నారు.

మంచినీటి ఎద్దడి నివారణకు కృషి చేస్తా

హుజూర్‌నగర్, జనవరి 31: పట్టణంలో మంచినీటి ఎద్దడి నివారణకు కృషి చేస్తానని మునిసిపల్ చైర్‌పర్సన్ గెల్లిఅర్చనరవి అన్నారు. బుధవారం పట్టణంలోని 18, 19 వార్డుల్లో రూ.10లక్షలతో నిర్మించే సీసీ రోడ్డు పనులకు శంకుస్థాపన చేసి మాట్లాడారు. అబివృద్ధిలో ప్రజలు భాగస్వామ్యం కావాలన్నారు.కార్యక్రమంలో కుంట సైదులు, ఉపేంద్ర, వల్లపుదాసు ఎల్లమ్మ, కృష్ణ, షేక్ సైదా, వెంకన్న, సైదమ్మ, పాల్గొన్నారు.

గద్దర్ చిత్రపటానికి నివాళి

అర్వపల్లి, జనవరి 31: తెలంగాణ గాయకుడు గద్దర్ జయంతి పురస్కరించుకుని బుధవారం అర్వపల్లి మండల కేంద్రంలో బహుజన కళావేదిక, వివిధ ప్రజా సంఘాల ఆధ్వర్యంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో నాయకులు చామకూరి నర్సయ్య, ఈదుల వీరపాపయ్య, దరిపెల్లి వెంకట్, నోముల వంశీ, బింగి శ్రీకాంత్, మామిడి సురేష్, జీడి రవి, సురేష్, లక్ష్మణచారి పాల్గొన్నారు.

సాగర్ ఎస్ఈ కార్యాలయ ముట్టడి రేపు

సూర్యాపేట సిటీ, జనవరి 31: నాగార్జునసాగర్ ఎడమ కాలువకు నీటిని విడుదల చేసి ఎండిపోతున్న వరి పైర్లను కాపాడాలని కోరుతూ నాగార్జునసాగర్ ఎస్ఈ కార్యాలయాన్ని ఈ నెల రెండో తేదీన ముట్టడిస్తున్నామని సీపీఎం జిల్లా కార్యదర్శి మల్లు నాగార్జున రెడ్డి కోరారు. ఈ ముట్టడి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరుతూ బుధవారం జిల్లా కేంద్రంలోని మల్లు వెంకటనరసింహారెడ్డి భవన్‌లో నిర్వహించిన ఆ పార్టీ జిల్లా కమిటీ, మండల కార్యదర్శుల సంయుక్త సమావేశంలో ఆయన మాట్లాడారు. సాగర్ ఎడమ కాలువ పరిధిలో సాగు చేసిన వరి పైర్లు నీళ్లు సరిపోక ఎండిపోతున్నాయని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఎడమ కాలువకు నీటిని విడుదల చేసి చెరువులు, కుంటలను నింపి భూగర్భ జలాలు పెంపొందించి పంటలను కాపాడాలని కోరారు. సీపీఎం, రైతు సంఘాల ఆధ్వర్యంలో ఆందోళన చేపట్టిన రాష్ట్ర ప్రభుత్వం పట్టించుకోనందుకు నిరసనగా సాగర్ ఎస్ఈ కార్యాలయాన్ని ముట్టడిస్తున్నట్లు ఆయన తెలిపారు. సమావేశంలో ఆ పార్టీ జిల్లా కార్యదర్శి నెమ్మాది వెంకటేశ్వర్లు, జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు కొలిశెట్టి యాదగిరి, పారేపల్లి శేఖర్ రావు, బుర్రి శ్రీరాములు, మట్టిపల్లి సైదులు, మేదరమెట్ల వెంకటేశ్వర్‌రావు, కోట గోపి, చెరుకు ఏకలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

'జాన్‌పహడ్ దర్గా నిజమైన హక్కుదారులపై వివక్ష'


సూర్యాపేటటౌన్, జనవరి 31: జాన్‌పహడ్ దర్గాపై నిజమైన హక్కుదారులమైన తమపై వివక్ష చూపుతున్నారని హైమద్ హుస్సేన్, గులాం రసూల్ అన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. 400ఏళ్ల క్రితం నుంచి జాన్‌పహడ్ దర్గాకు ముతవలీలుగా వ్యవహరించడడం తమ పూర్వీకుల నుంచి సంప్రదాయంగా వస్తుందన్నారు. 1989లో దర్గాను వక్ఫ్‌బోర్డు స్వాధీనం చేసుకున్న తమను దర్గాలోకి రావడంలేదన్నారు. కోర్టులో తమకు అనుకూలంగా తీర్పు వచ్చినా వక్ఫ్‌బోర్డు అధికారులు ముతవలీలుగా హక్కులు కల్పిచడంలేదని తెలిపారు. కార్యక్రమంలో మహ్మద్ హస్సన్, మహ్మద్ హుస్సేన్, మహ్మద్ సాలార్ పాల్గొన్నారు.

ఆర్టీసీ ఇన్‌స్పెక్టర్‌పై చర్యలు తీసుకోవాలి

సూర్యాపేట అర్బన్, జనవరి 31: సూర్యాపేట ఆర్టీసీ డిపో ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ నాగశ్రీపై చర్యలు తీసుకోవాలని ఆర్టీసీ జేఏసీ నాయకులు డిమాండ్ చేశారు. బుధవారం జిల్లా కేంద్రంలోని ఆర్టీసీ ఎదుట ఆర్టీసీ జేఏసీ ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా జేఏసీ నాయకులు మాట్లాడుతూ 2019లో సమ్మె సందర్భంగా 14మంది డిపో కార్మికులపై కేసు నమోదైందని, కార్మికులు కోర్టుకు హాజరు కావాల్సి ఉన్నా, విధులకు రావాలని వేధిస్తున్నారని తెలిపారు. డిపోలో చాలా కాలంగా సూపర్‌వైజర్లు, ఏడీసీలు పనిచేస్తూ కార్మికులపై కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతున్నారని ఆవేదనవ్యక్తం చేశారు. కార్మికులను వేధిస్తున్న డిపో ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్‌పై ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఆర్టీసీ జేఏసీ నాయకులు ఎస్.ఎస్ గౌడ్, బత్తుల సుధాకర్, అంజయ్య, లచ్చయ్య, సైదులు, లక్ష్మయ్య, మధుసూదన్‌రావు, వెంకన్న, రమేష్, సైదులు, వెంకటేశ్వర్లు, వీరయ్య, లింగయ్య, స్వామి, శ్రీకంఠం సుజాత పాల్గొన్నారు.

కాంగ్రెస్ విజయంతో సోషల్ మీడియా కీలకపాత్ర

తుంగతుర్తి, జనవరి 31: రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ విజయం సాధించడంతో సోషల్ మీడియా కీలక పాత్ర పోషించిందని ఆ పార్టీ రాష్ట్ర సోషల్ మీడియా కోఆర్డినేటర్ పెట్టం నవీన్ అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని ఓ ప్రైవేటు ఫంక్షన్ హాల్‌లో నిర్వహించిన నియోజకవర్గ స్థాయి సోషల్ మీడియా కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో రాహుల్‌గాంధీని ప్రధానిని చేసే లక్ష్యంగా సోషల్ మీడియా పనిచేయాలన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వ ఆరు గ్యారెంటీల పథకాల వివరాలు అందరికీ చేరడానికి కృషి చేయాలన్నారు. పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ విజయం సాధించడానికి కార్యకర్తలు సైనికుల్లా పనిచేయాలని కోరారు. కార్యక్రమంలో భువనగిరి పార్లమెంట్ సోషల్ మీడియా ఇన్‌చార్జి భార్గవ్, తెలంగాణ రాష్ట్ర యువజన కాంగ్రెస్ సోషల్ మీడియా కోఆర్డినేటర్ కొండ రాజు, రామడుగు నవీన్, దొంగరి గోవర్ధన్, కిషన్‌రావు, అజయ్, నరేష్, అబ్దుల్, రాంబాబు, రాములు పాల్గొన్నారు.



భానుపురి: రాష్ట్రంలో సీపీఎస్ విధానాన్ని రద్దు చేయాలని సూర్యాపేట ఇరిగేషన్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ భద్రునాయక్ అన్నారు. సూర్యాపేట ఇరిగేషన్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ కార్యాలయంలో టీఎస్‌సీపీఎస్ఈయూ- 2024 టేబుల్ క్యాలెండర్‌ను ఆయన ఆవిష్కరించి మాట్లాడారు. కార్యక్రమంలో సీపీఎస్ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు లక్కపాక ప్రవీణ్‌కుమార్, డివిజనల్ ఇంజనీరు పాల్గొన్నారు.

● నూతన జాతీయ విద్యావిధానం-2020 రద్దు కోసం ఖిల భారత విద్యా హక్కు వేదిక ఆధ్వర్యంలో ఢిల్లీలోని జంతర్‌మంతర్ వద్ద ఈ నెల మూడో తేదీన జరిగే ధర్నాను విజయవంతం చేయాలని డీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు రేపాలక లింగయ్య కోరారు. సూర్యాపేటలోని డీటీఎఫ్ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. సమావేశంలో ఎల్, భద్రయ్య, కరీం, నాగేందర్‌నాయక్, వెంకట్‌యాదవ్ పాల్గొన్నారు.

ఆత్మకూర్(ఎస్): మండల కేంద్రానికి చెందిన బైరెడ్డి పోతన్‌రెడ్డి కుమారుడు విహాన్‌రెడ్డి మొదటి పుట్టినరోజు సందర్భంగా ఆత్మకూర్ (ఎస్) ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల, అంగన్‌వాడీ కేంద్రాల్లో విద్యార్థులకు ప్లేట్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో హెచ్ఎం నాగలక్ష్మి పాల్గొన్నారు.

పెన్‌పహాడ్: మండలంలోని దూపహాడ్ గ్రామానికి చెందిన పత్తిపాక రామయ్య ఈ నెల 21న మృతిచెందగా, బుధవారం నిర్వహించిన సంతాప సభకు మాజీ మంత్రి రాంరెడ్డి దామోదర్‌రెడ్డి హాజరయ్యారు. ఈ సంద ర్భంగా ఆయన మాట్లాడుతూ రామయ్య కుటుంబాన్ని ప్రభుత్వపరంగా ఆదుకుంటామన్నారు. కార్యక్రమంలో కొప్పుల వేణారెడ్డి, పోతు భాస్కర్, భుజంగరావు, కోటేశ్వర్‌రావు, కేశవులు పాల్గొన్నారు.

హుజూర్‌నగర్: దళిత ఉద్యమనేత నందిగామ ప్రసాద్ ఆశయాలను సాధించాలని బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ కోరారు. పట్టణంలోని ఫంక్షన్‌హాల్‌లో నిర్వహించిన ప్రసాద్ సంస్మరణ సభలో ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో డాక్టర్ ప్రతాప్ పాల్గొన్నారు.

నేరేడుచర్ల: గ్రామాల్లో సీసీ కెమెరాల ఏర్పాటుకు ప్రజలు స్వచ్ఛందంగా సహకరించాలని ఎస్ఐ పరమేష్ కోరారు. పోలీస్‌స్టేషన్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రూ.40వేల వ్యయంతో ఐదు కెమెరాలు ఏర్పాటు చేసుకోవచ్చన్నారు.

● గణతంత్ర దినోత్సవం సందర్భంగా అవార్డు అందుకున్న మునిసి పల్ కమిషనర్ వెంకటేశ్వర్లును, సీపీఐ మాస్‌లైన్ ప్రజాపంథా సభ్యులు సన్మానించారు. నేరేడుచర్ల మండల కేంద్రంలో నిర్వహించిన కార్యక్రమంలో వాసా పల్లయ్య, హుస్సేన్, కరుణాకర్, పావని, చందన, లక్ష్మి పాల్గొన్నారు.

మేళ్లచెర్వు: రాష్ట్ర ప్రభుత్వం నిరుద్యోగ భృతి ఇవ్వడంతో పాటు వృతి విద్యలో నైపుణ్యం కల్పించి యువతను ఆదుకోవాలని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు ఉస్తెల నారాయణరెడ్డి, ధూళిపాక ధనుంజయనాయుడు కోరారు. బుధవారం మండల కేంద్రంలో ఏఐవైఎఫ్ నేత రామకృష్ణ సంతాపసభలో పాల్గొని ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించి మాట్లాడారు. కార్యక్రమంలో సమైక్య రాష్ట్ర అధ్యక్షురాలు పోటు కళావతి, మహిళా సమాఖ్య జిల్లా ప్రధాన కార్యదర్శి మల్లీశ్వరి, సీపీఐ కార్యదర్శి సారెడ్డి పాపిరెడ్డి, గొంగరెడ్డి భద్రారెడ్డి, సత్యం పాల్గొన్నారు.

మద్దిరాల: విద్యార్థులు అన్ని రంగాల్లో రాణించాలని కాంగ్రెస్ పార్టీ మండల వర్కింగ్ ప్రెసిడెంట్ తాళ్లపల్లి సురేష్ అన్నారు. మండలంలోని గోరెంట్ల గ్రామ జడ్పీ హైస్కూల్‌లో కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకుడు చల్లా తేజ ఆర్థికసాయంతో పదో తరగతి విద్యార్థులకు స్టడీ మెటీరియల్, ప్యాడ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో కోడి కుమార్‌యాదవ్, సాగర్, బత్తుల వెంకన్న, రాంమూర్తి, శ్రీను, సమ్మయ్య, సాయి పాల్గొన్నారు.

● మద్దిరాల మండల ఎస్ఐగా బాధ్యతలు స్వీకరించిన మధునాయుడిని కాంగ్రెస్ పార్టీ నాయకులు సన్మానించారు. కార్యక్రమంలో నాయకులు పచ్చిపాల వెంకన్న, కొమ్ము అంజయ్య, కోడి కుమార్‌యాదవ్, సుధాకర్‌రెడ్డి, శ్రీరాములు, తాళ్లపల్లి సురేష్, వెంకన్న పాల్గొన్నారు.

కోదాడ టౌన్: పట్టణంలోని బాలుర ఉన్నత పాఠశాలలో స్వపరిపాలన దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు, అధికారులు, ప్రజాప్రతినిధుల పాత్రలను ఉపాధ్యాయులు పోషించారు. కార్యక్రమంలో ఎంఈవో సలీంషరీఫ్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు

చిలుకూరు: ప్రజా సమస్యలను అధికారులు సత్వరం పరిష్కరించాలని మండల ప్రత్యేకాధికారి రూప్‌సింగ్ సూచించారు. మండలంలోని దూద్యాతండా, సీత్లాతండా, నారాయణపురం గ్రామాల్లో గ్రామపంచాయతీ కార్యాలయాలు, అంగన్వాడీ సెంటర్లు, నర్సరీలు, పాఠశాలలు, పల్లె దవాఖానాలు, సెగ్రిగేషన్ షెడ్లను తనిఖీ చేసి మాట్లాడారు. వేసవిలో గ్రామాల్లో నీటి సమస్య తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని గ్రామ కార్యదర్శులకు సూచించారు.

మునగాల రూరల్: స్థానిక గ్రంథాలయాధికారి దేవబత్తిని లలితాదేవి సోదరుడు దేవినేని సాంబశివరావు జ్ఞాపకార్థం మండలంలోని ముకుందాపురం గ్రామ శివారులో ఉన్న ఇందిర అనాథాశ్రమంలో బుధవారం అన్నదానం నిర్వహించారు. కార్యక్రమంలో అనంతుల శ్రీను, గండు సతీష్, నాగరాజు, మోహన్, ఈశ్వర్, ఉపేందర్, జి.ఈశ్వర్ పాల్గొన్నారు.

తిరుమలగిరి: గడువులోగా సీఎంఆర్ బియ్యాన్ని ప్రభుత్వానికి అప్పగించాలని తహసీల్దార్ రమణారెడ్డి కోరారు. తిరుమలగిరి మునిసిపల్ కేంద్రంలోని ఏఎస్ఆర్, శ్రీలక్ష్మి బియ్యం మిల్లులను బుధవారం ఆయన తనిఖీ చేసి మాట్లాడారు. గడువులోగా సీఎంఆర్ పూర్తి చేయకుంటే చట్టరీత్యా క్రిమినల్ కేసులు నమోదుచేస్తామని హెచ్చరించారు. అనంతరం అంగన్‌వాడీ కేంద్రాలను, రేషన్ షాపులను తనిఖీ చేశారు.

● తిరుమలగిరి మండలంలోని తొండ గ్రామంలో ఇచ్చిన గ్రానైట్ పర్మిషన్ రద్దు చేయాలని ఆ గ్రామ సర్పంచ్ శాతవాహనరావు ఆధ్వర్యంలో గ్రామస్థులు ఎమ్మెల్యే సామేల్‌కు వినతిపత్రం అందజేశారు.